# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు

విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టీ. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

సంపుటి : 10 సంచిక : 27 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కాకినాడ శుక్రవారం 2 అక్టోబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME 10 ISSUE :27 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAKINADA FRI 2 OCTOBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Kakinada,Ongole,Visakhapatnam,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


## కూతురు రాజకీయ ఎంట్రీపై మంత్రి నారాయణ క్లారిటీ!



- తన కూతురు షరణి మేయర్‌గా పోటీ చేయదని నారాయణ స్పష్టీకరణ
- తన కుటుంబం నుంచి ఎవరూ రాజకీయాల్లోకి రారని వెల్లడి
- ప్రజా సేవ చేయడానికే తాను రాజకీయాల్లోకి వచ్చానన్న మంత్రి

పెన్ పవర్ డెస్క్:తన కుమార్తె షరణి రాజకీయ ప్రవేశంపై వస్తున్న వదంతులకు ఆంధ్రప్రదేశ్ మంత్రి నారాయణ తెరదించారు. తన కుటుంబం నుంచి ఎవరూ రాజకీయాల్లోకి రారని, తన కుమార్తె మేయర్‌గా పోటీ చేస్తారంటూ జరుగుతున్న ప్రచారంలో ఏమాత్రం వాస్తవం లేదని ఆయన స్పష్టం చేశారు. నెల్లూరులో మీడియాతో మాట్లాడుతూ, ఈ ఆరోపణలు నిరాధారమైనవని కొట్టిపారేశారు.తనపై ఎన్ని ఆరోపణలు వచ్చినా తాను పట్టించుకోనని మంత్రి నారాయణ అన్నారు. "కామెర్ల రోగికి లోకమంతా పచ్చగానే కనిపిస్తుంది"

- మిగతా 2లో

## 34% బీసీ రిజర్వేషన్లు రద్దు!

### ఏపీ స్థానిక ఎన్నికలపై హైకోర్టు కీలక తీర్పు..




- స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34% రిజర్వేషన్లు కల్పించే జీవోల రద్దు
- మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదని హైకోర్టు స్పష్టీకరణ
- ఆరు వారాల్లోగా ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వానికి ఆదేశం
- వార్డుల పునర్విభజన, ఇతర అంశాలపై దాఖలైన పిటిషన్లను కొట్టివేసిన ధర్మాసనం

- మిగతా 2లో

## లక్షలాది యువత ఆకాంక్షలకు ప్రతీక యూపీఎస్సీ



- యూపీఎస్సీ శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొన్న ప్రధాని నరేంద్ర మోదీ
- స్మారక నాణెం, పోస్టల్ స్టాంప్‌ను ఆవిష్కరించిన ప్రధాని
- లక్షలాది మంది యువత ఆశయాలకు యూపీఎస్సీ ప్రతీక అని వ్యాఖ్య
- సర్దార్ పటేల్, నేతాజీ సుభాష్ చంద్రబోస్ సేవలను స్మరించుకున్న ప్రధాని
- భారత పైలట్ స్మిత్ ధైర్యాన్ని కొనియాడిన మోదీ

- మిగతా 2లో




## బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టుకు వెళ్తాం

- గత ప్రభుత్వంపై రేపల్లె సభలో చంద్రబాబు తీవ్రస్థాయిలో విమర్శలు
- రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను వెంటిలేటర్‌పై పెడితే, తాము ఆక్సిజన్ అందించి కాపాడామన్న సీఎం
- అమరావతిని ఎడారి, శ్మశానం అన్నారని.. పోలవరాన్ని గోదావరిలో ముంచేశారని ఫైర్
- బీసీల రిజర్వేషన్లకు గత ప్రభుత్వం కుట్రపూరితంగా అడ్డుపడిందని ఆరోపణ
- స్వర్ణాంధ్ర 2047 లక్ష్యంతో రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తున్నామని స్పష్టం

పెన్ పవర్ డెస్క్:గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రం సర్వనాశనమైందని, ఆర్థిక వ్యవస్థను పూర్తిగా చిన్నాభిన్నం చేశారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బాపట్ల జిల్లా రేపల్లె నియోజకవర్గంలో జరిగిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు తెలుగుదేశం పార్టీ 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే, గత 'గొడ్డలి పార్టీ' ప్రభుత్వం దాన్ని 24 శాతానికి తగ్గించిందని ఆరోపించారు. "దీనివల్ల దాదాపు 16,800 మంది బీసీలు పదవులు కోల్పోయారు. మేము మళ్లీ 34 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని చూస్తే, వాళ్లే కోర్టుకు వెళ్లి అడ్డుపడ్డారు. బీసీలపై ద్వేషంతోనే ఈ కుట్ర చేస్తున్నారు. అయినా మేం వెనకడుగు వేయం. రేపే సుప్రీంకోర్టుకు వెళుతున్నాం. బీసీలకు న్యాయం జరిగే వరకు పోరాడతాం" అని ఆయన స్పష్టం చేశారు.

గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో జరిగిన ఆర్థిక విధ్వంసంపై చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. "అప్పులు దొరక్కపోతే రాష్ట్ర ఆస్తులను తాకట్టు పెట్టారు. కనీసం మద్యపాన నిషేధం హామీని నిలబెట్టుకోకుండా, భవిష్యత్తులో 25 ఏళ్లపాటు మద్యం ద్వారా వచ్చే ఆదాయాన్ని కూడా తాకట్టు పెట్టి అప్పులు తెచ్చిన దారుణమైన పరిస్థితిని సృష్టించారు. మేం అధికారంలోకి వచ్చాక ఆ అప్పుల వడ్డీ రేట్లను తగ్గించి, ఆర్థిక క్రమశిక్షణతో రాష్ట్రాన్ని మళ్లీ గాడిన పెడుతున్నాం" అని వివరించారు. ముఖ్యమంత్రి అంటే సెక్రటేరియట్‌లో కూర్చోవడం కాదని, సామాన్యుడిలా ప్రజల మధ్య ఉంటూ

- మిగతా 2లో



## నెల రోజుల్లో డీఎస్సీ 2.0

### అధికారులకు మంత్రి నారా లోకేశ్ కీలక ఆదేశాలు

- నెల రోజుల్లో డీఎస్సీ 2.0 నోటిఫికేషన్ విడుదలకు ఆదేశం
- పదో తరగతి ఫలితాల కోసం 'మిషన్ మార్చ్' పకడ్బందీగా అమలు
- యూనివర్సిటీల్లో 1523 అధ్యాపక పోస్టుల భర్తీకి చర్యలు
- స్కూల్ డ్రాపౌట్ల నివారణకు 'జీరో డ్రాప్ అవుట్ మిషన్'
- విశాఖలో ఏయూ శతాబ్ది ఉత్సవాల గుర్తుగా ప్రతిష్ఠాత్మక గ్రంథాలయం

పెన్ పవర్ డెస్క్:నెల రోజుల్లోపు డీఎస్సీ 2.0 నోటిఫికేషన్ విడుదల చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. ఉండవల్లిలోని తన నివాసంలో విద్యాశాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. నోటిఫికేషన్ విడుదల నుంచి పోస్టింగ్ ఉత్తర్వుల జారీ వరకు ప్రతి దశలోనూ పూర్తి పారదర్శకత పాటించాలని స్పష్టం చేశారు.

- మిగతా 2లో



## బీచ్‌లో విషాదం.. ఎనిమిది మంది విద్యార్థుల మృతి

పెన్ పవర్ డెస్క్:మహారాష్ట్రలోని రాయ్‌గఢ్ జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. విహారయాత్రలో భాగంగా బీచ్‌కు వెళ్లిన విద్యార్థుల్లో ఎనిమిది మంది నీట మునిగి ప్రాణాలు కోల్పోయారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పుణె జిల్లాలోని ఓ ప్రైవేట్ కోచింగ్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన విద్యార్థులు, సిబ్బంది రాయ్‌గఢ్ జిల్లాలోని దివేఅగర్ బీచ్‌కు పిక్నిక్‌కు వెళ్లారు. వీరిలో 25 మంది బాలురు, 17 మంది బాలికలు, ఆరుగురు ఉపాధ్యాయులు సహా మొత్తం 48 మంది ఉన్నారు. ఈ క్రమంలోనే సముద్రంలో దిగిన ఎనిమిది మంది విద్యార్థులు నీటి

- మిగతా 2లో

## బీసీ రిజర్వేషన్లు: టీడీపీ, వైసీపీలపై విజయసాయి రెడ్డి తీవ్ర విమర్శలు



- స్థానిక సంస్థల్లో 34 శాతం బీసీ రిజర్వేషన్లను రద్దు చేసిన హైకోర్టు
- 50 శాతం కోటా పరిమితిని దాటవద్దన్న సుప్రీం నిబంధనను గుర్తు చేసిన న్యాయస్థానం
- బీసీలను టీడీపీ, వైసీపీ మోసం చేస్తున్నాయన్న విజయసాయి

పెన్ పవర్ డెస్క్:బీసీ రిజర్వేషన్ల అంశంపై తెలుగుదేశం, వైసీపీ నాటకాలాడుతున్నాయని, ఓట్ల కోసం బీసీలను మోసం చేస్తున్నాయని మాజీ ఎంపీ విజయసాయి రెడ్డి

- మిగతా 2లో

## హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ కు కొత్త బాస్..

### ఎండీ, సీఈవోగా అనుప్ బగ్చీ నియామకం




- ప్రస్తుత సీఈవో శశిధర్ జగదీశన్ స్థానంలో నియామకం
- అక్టోబర్ 27 నుంచి మూడేళ్ల పాటు పదవిలో కొనసాగింపు
- బగ్చీ నియామకానికి ఆమోదం తెలిపిన రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
- గతంలో ఐసీఐసీఐ గ్రూప్‌లో కీలక పదవుల్లో పనిచేసిన అనుభవం

- మిగతా 2లో



## ఫిల్మ్ ఛాంబర్‌లో హైడ్రామా

### ఫెడరేషన్ పెద్దలతో జానీ మాస్టర్ భార్య సుమలత వాగ్వాదం..

- ఫిల్మ్ ఛాంబర్ వద్ద సుమలత తీవ్ర వాగ్వాదం
- సమావేశంలోకి తనను అనుమతించకపోవడంపై ఆగ్రహం
- సుమలత నాయకత్వంలోని కార్యవర్గాన్ని రద్దు చేసిన ఫెడరేషన్
- అక్టోబర్ 18న డాన్సర్స్ అసోసియేషన్‌కు కొత్త ఎన్నికల ప్రకటన
- జానీ మాస్టర్‌పై సహాయ నిరాకరణ కొనసాగిస్తున్నట్లు స్పష్టీకరణ

- మిగతా 2లో

## చరిత్రకు జీవం: నిజాంలు నీళ్లు తాగిన బావికి హైడ్రా పునరుజ్జీవం

- పాతబస్తీలోని చారిత్రక బుమ్-రుక్న్-ఉద్-దౌలా చెరువు కింద ఉన్న పురాతన బావి
- సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో హైడ్రా ఆధ్వర్యంలో పునరుద్ధరణ పనులు ప్రారంభం
- నిజాంల కాలంలో ఔషధ గుణాలున్న నీటిని అందించిన బావిగా ప్రత్యేక గుర్తింపు
- వారసత్వ పరిరక్షణ, పర్యావరణ అభివృద్ధి లక్ష్యంగా ఈ ప్రాజెక్టు రూపకల్పన

- మిగతా 2లో



## కావాలంటే ఇప్పుడే నన్ను అరెస్ట్ చేసుకోండి: ఫడ్నవీస్‌కు అభిజీత్ దీప్కే సవాల్



- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ దేశద్రోహి అని ఆరోపణ
- అక్టోబర్ 2 నుంచి ముంబైలో ఆందోళనలకు పిలుపు
- పోలీసుల అనుమతి అవసరం లేదని స్పష్టం

పెన్ పవర్ డెస్క్:మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌పై కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అక్టోబర్ 2 నుంచి తమ పార్టీ తలపెట్టిన ఆందోళనల నేపథ్యంలో, వ్యూహాత్మక తప్పులు చేయవద్దని ఆయన ప్రభుత్వానికి గట్టి హెచ్చరిక జారీ చేశారు. ? కావాలంటే తనను ఇప్పుడే అరెస్ట్ చేయాలని ఆయన సవాల్ విసిరారు.గురువారం ముంబైలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో దీప్కే మాట్లాడుతూ, కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ)

- మిగతా 2లో




## లక్షలాది యువత ఆకాంక్షలకు ప్రతీక యూపీఎస్సీ

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) వందేళ్ల ప్రస్థానం లక్షలాది మంది యువత ఆకాంక్షలకు, దేశ ప్రజల నమ్మకానికి ప్రతీక అని ప్రధాని నరేంద్ర మోదీ కొనియాడారు. గురువారం ఢిల్లీలోని భారత్ మండపంలో జరిగిన యూపీఎస్సీ శతాబ్ది ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూపీఎస్సీ శతాబ్ది స్మారక నాణెం, పోస్టల్ స్టాంప్‌తో పాటు '100 ల్యాండ్‌మార్క్ జడ్జిమెంట్స్' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. నిన్న జరిగిన ఒక విమాన ప్రమాద ఘటనలో అసాధారణ ధైర్య సాహసాలు ప్రదర్శించిన భారత పైలట్, కెప్టెన్ స్మిత్ మచ్చర్‌ను ప్రత్యేకంగా అభినందించారు. "నిన్న జరిగిన ఘటనలో భారత పైలట్ కెప్టెన్ స్మిత్ చూపిన ధైర్యం, సమయస్ఫూర్తి, నిబద్ధత ప్రశంసనీయం. ఇజ్రాయెల్ ప్రధాని చెప్పినట్లుగా, 9/11 తరహా ఘోర విషాదాన్ని ఒక భారతీయుడు అడ్డుకున్నాడు" అని మోదీ అన్నారు. స్మిత్ ఘనత మనందరికీ గర్వకారణమని, తాను ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడానని తెలిపారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్న స్మిత్ సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని దేశ ప్రజలందరూ ప్రార్థించాలని పిలుపునిచ్చారు. యూపీఎస్సీ వందేళ్ల ప్రస్థానంపై మోదీ మాట్లాడుతూ.. "ఇది కేవలం ఒక సంస్థ వందేళ్లు పూర్తి చేసుకోవడం కాదు, ఇది లక్షలాది యువత ఆశయాల వేడుక. ప్రతి భారతీయుడు ఈ సంస్థపై ఉంచిన అచంచల విశ్వాసానికి ఇది నిలువుటద్దం. ఈ సంస్థను ఉన్నత శిఖరాలకు చేర్చిన ప్రతి ఒక్కరికీ నా అభినందనలు" అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సివిల్ సర్వీసుల చరిత్రను, మహనీయుల సేవలను మోదీ గుర్తుచేసుకున్నారు. "1920లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఈ పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు. ఆనాడు బ్రిటిష్ పాలన ఉన్నప్పటికీ ఆయన సంస్కృతంలో పేపర్ రాశారని ఇక్కడి గ్యాలరీలో చూశాను. అదేవిధంగా, దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశాన్ని నడపడంలో సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ కీలక పాత్ర పోషించారు. స్వతంత్ర భారతానికి అవసరమైన 'ఉక్కు చట్రాన్ని' (స్టీల్ ఫ్రేమ్) సర్దార్ పటేల్ అందించారు. ఈ సంస్థను దేశానికి ఒక ప్రధాన స్తంభంగా తీర్చిదిద్దారు" అని మోదీ వివరించారు. 1926 అక్టోబర్ 1న పబ్లిక్ సర్వీస్ కమిషన్‌గా ప్రారంభమైన ఈ సంస్థ, శతాబ్ద కాలంలో ఎన్నో మార్పులకు లోనై స్వతంత్ర రాజ్యాంగబద్ధ సంస్థగా రూపుదిద్దుకుందని ప్రధాని గుర్తుచేశారు. గతేడాది అక్టోబర్ 1న ప్రారంభమైన శతాబ్ది ఉత్సవాలు ఈ కార్యక్రమంతో ముగిశాయి. సెప్టెంబర్ 30, అక్టోబర్ 1 తేదీల్లో రెండు రోజుల పాటు జరిగిన ఈ వేడుకల్లో వివిధ రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్ల చైర్మన్లు, సభ్యులు, కేంద్ర ప్రభుత్వ సీనియర్ అధికారులు, విద్యావేత్తలు, యూపీఎస్సీ అధికారులు పాల్గొన్నారు.

## నెల రోజుల్లో డీఎస్సీ 2.0

- మొదటి పేజి తరువాయి

ఏపీ రిక్రూట్‌మెంట్ మోడల్‌ను దేశం మొత్తం ఆసక్తిగా గమనిస్తోందని, ఇతర రాష్ట్రాలు మన విధానాలను అనుసరించేలా సమర్థవంతంగా పనిచేయాలని ఆయన సూచించారు.

పాఠశాల విద్యలో కీలక సంస్కరణలపై మంత్రి ప్రత్యేక దృష్టి సారించారు. పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాల సాధనే లక్ష్యంగా 'మిషన్ మార్చ్' కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. బడి మానేసే పిల్లల సమస్యపై సింగపూర్ హోంమంత్రి షణ్ముగం చేసిన సూచనలను ప్రస్తావిస్తూ.. రాష్ట్రంలో 'జీరో డ్రాప్ అవుట్ మిషన్' చేపట్టాలని సూచించారు. డ్రాపౌట్ల నివారణలో సమాజంలోని పెద్దలను, స్థానిక ప్రముఖులను భాగస్వాములను చేయాలని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. ఉన్నత విద్యారంగంపై కూడా సమీక్షించిన లోకేశ్, రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న 1,523 అధ్యాపక పోస్టుల భర్తీకి పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీనిపై అధికారులు స్పందిస్తూ, ఇప్పటికే దరఖాస్తుల ప్రక్రియ పూర్తయిందని, డిసెంబరులో ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో రాత పరీక్షలు నిర్వహిస్తామని వివరించారు. రాష్ట్రంలో పలు ప్రతిష్ఠాత్మక ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు తమ క్యాంపస్‌లను ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపుతున్నాయని, వాటికి అవసరమైన భూమిని గుర్తించాలని మంత్రి సూచించారు.

ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాల నేపథ్యంలో విశాఖపట్నంలో పబ్లిక్ లైబ్రరీ భాగస్వామ్యంతో ఒక ప్రతిష్ఠాత్మక గ్రంథాలయాన్ని నిర్మించనున్నట్లు మంత్రి వెల్లడించారు. అలాగే, రాష్ట్రవ్యాప్తంగా 125 ఆటిజం సెంటర్ల ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి జె. శ్యామలరావుతో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## కావాలంటే ఇప్పుడే నన్ను అరెస్ట్ చేసుకోండి: ఫడ్నవీస్‌కు అభిజీత్ దీప్కే సవాల్

- మొదటి పేజి తరువాయి

జ్ఞానేశ్ కుమార్‌ను "దేశద్రోహి"గా అభివర్ణించారు. దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితాలో భారీగా అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ, ఆయన తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా 13 కోట్ల మంది ఓటర్ల పేర్లను తొలగించారని, వారంతా రోడ్లపైకి వస్తే జ్ఞానేశ్ కుమార్ బాస్‌ల రాజీనామాను కూడా ప్రజలు డిమాండ్ చేస్తారని హెచ్చరించారు. ఎన్నికల కమిషన్ ప్రత్యేక సవరణ జాబితాను నిలిపివేసి, 2005 ఓటర్ల జాబితాతోనే ఎన్నికలు నిర్వహించాలని దీప్కే డిమాండ్ చేశారు. ఆందోళనకారులను మూడు రోజుల పాటు జైల్లో పెడతామన్న ఫడ్నవీస్ వ్యాఖ్యలపై స్పందిస్తూ, "నన్ను మూడు రోజులు కాదు, మూడు నెలల పాటు జైల్లో పెట్టండి, నేను మళ్లీ మళ్లీ వీధుల్లోకి వస్తూనే ఉంటాను" అని అభిజీత్ దీప్కే ఘాటుగా బదులిచ్చారు. నిరసనలకు పోలీసుల అనుమతి అవసరం లేదని, స్వాతంత్ర్య పోరాట సమయంలో మహాత్మా గాంధీ బ్రిటిష్ వారి అనుమతి అడగలేదని గుర్తుచేశారు. "శివాజీ పార్కులో ఫడ్నవీస్ ఓట్ల కోసం సభ నిర్వహించగలిగినప్పుడు, మేమెందుకు అదే వేదికపై నిరసన తెలపకూడదు?" అని ఆయన ప్రశ్నించారు. అక్టోబర్ 4న ప్రతిపక్షాలు నిర్వహించే ఉమ్మడి ఆందోళనకు తమ పార్టీ పూర్తి మద్దతు ఇస్తుందని దీప్కే ప్రకటించారు. తాను దేశవ్యాప్త పర్యటనలో ఉన్నప్పటికీ, సీజేపీ కార్యకర్తలు ముంబైలో భారీ సంఖ్యలో పాల్గొంటారని తెలిపారు. తన రూ. 30,000 విలువైన బూట్లపై వస్తున్న విమర్శలపై స్పందిస్తూ, తనకు స్తోమత ఉన్నందున వాటిని కొనుగోలు చేశానని, అదొక ఫ్యాన్ మూమెంట్ మాత్రమేనని కొట్టిపారేశారు.

# బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టుకు వెళ్తాం

- మొదటి పేజి తరువాయి

వారి కష్టాలు తీర్చడమే తన బాధ్యత అని స్పష్టం చేశారు.

**అమరావతి జోలికెళితే మసైపోతారు!**

రాజధాని అమరావతి, జీవనాడి పోలవరం ప్రాజెక్టులను గత ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే నాశనం చేసిందని చంద్రబాబు ఆరోపించారు. "సైబరాబాద్‌ను నిర్మించిన అనుభవంతో అమరావతిని ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దాలనుకుంటే, అధికారంలోకి రాగానే మూడు రాజధానులంటూ నాటకాలకు తెరలేపారు. అమరావతిని ఎడారి, శ్మశానం అంటూ సర్వనాశనం చేశారు. కానీ రైతుల త్యాగాలు, ముక్కోటి దేవతల ఆశీస్సులతో అమరావతి నిలబడింది. ఇకపై అమరావతిని ఒక్క ఇంచు కూడా ఎవరూ కదిలించలేరు. ఆ ప్రయత్నం చేస్తే మసి అయిపోతారు" అని తీవ్రంగా హెచ్చరించారు. అదేవిధంగా, పోలవరం డయాఫ్రమ్ వాల్‌ను గోదావరిలో ముంచేశారని, తాము మళ్లీ దాన్ని బాగుచేసి వచ్చే ఏడాది మార్చి నాటికి ఫేజ్-1 పూర్తి చేసి కృష్ణా నదికి నీళ్లు అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రతిపక్షంలో నిర్మాణాత్మక పోటీతత్వం ఉండాలి గానీ, గత ప్రభుత్వంలో కుట్రతత్వం మాత్రమే ఉందని చంద్రబాబు విమర్శించారు. "మేం పరిశ్రమలు తెస్తే, వాళ్లు పారిశ్రామికవేత్తలను తరిమికొట్టారు. ఇప్పుడు మళ్లీ పారిశ్రామికవేత్తలు రాష్ట్రానికి క్యూ కడుతున్నారు. వ్యాన్‌పిక్ వంటి ప్రాజెక్టులను అవినీతితో నాశనం చేసి, ఈ ప్రాంత అభివృద్ధిని అడ్డుకున్నారు. ఇప్పుడు సీబీఐ, ఈడీ కేసుల్లో ఇరుక్కున్నారు. మేం రోడ్లు వేస్తే వాళ్లు గుంతలు తవ్వారు. పట్టాదారు పాసుపుస్తకాలపై, సర్వే రాళ్లపై కూడా వాళ్ల బొమ్మలు వేసుకొని రూ.800 కోట్లు దుర్వినియోగం చేశారు" అని ఆరోపించారు. వీటన్నింటినీ సరిచేసి, భూ సమస్యలకు బ్లాక్‌చైన్ టెక్నాలజీతో శాశ్వత పరిష్కారం చూపుతున్నామని తెలిపారు.

**పాలనలో మార్పులు, అభివృద్ధి మంత్రం**

తాము కేవలం బటన్ నొక్కి డబ్బులు పంచే ప్రభుత్వం కాదని, ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా నిలబెట్టేందుకు కృషి చేస్తున్నామని చంద్రబాబు అన్నారు. పీ4 కార్యక్రమం ద్వారా మార్గదర్శి కుటుంబాలు, బంగారు కుటుంబాల పేరిట ఆర్థిక అసమానతలు తగ్గించేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు. 'ఆరోగ్యం, ఆదాయం, ఆనందం' అనే మూడు సూత్రాలతో 'స్వర్ణాంధ్ర 2047' లక్ష్యాన్ని ప్రజల భాగస్వామ్యంతో సాధిస్తామని చంద్రబాబు నాయుడు పునరుద్ఘాటించారు.

**మోదీ, పవన్‌తో కలిసే హామీ ఇచ్చాం!**

2024 ఎన్నికల్లో ప్రధాని నరేంద్ర మోదీ, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌తో కలిసి ప్రజల వద్దకు వచ్చామని, రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తామని హామీ ఇచ్చామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గుర్తుచేశారు. ఆ నమ్మకంతోనే ప్రజలు కూటమికి 54% ఓట్లు, 94% సీట్లతో చారిత్రక విజయాన్ని అందించారని అన్నారు. ప్రజలు ఇచ్చిన అధికారాన్ని తాము బాధ్యతగా స్వీకరించామని, ముఖ్యమంత్రి నుంచి మంత్రులు, ఎమ్మెల్యేల వరకు అందరూ ప్రజలకు సేవకులే తప్ప పెత్తందారులు కాదని స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా ప్రధాని మోదీపై చంద్రబాబు ప్రశంసలు కురిపించారు. రైల్వే స్టేషన్‌లో టీ అమ్మిన ఒక సాధారణ కుటుంబానికి చెందిన వ్యక్తి, తన సమర్థతతో దేశ ప్రధాని స్థాయికి ఎదిగారని కొనియాడారు. ప్రజాస్వామ్యంలో ప్రపంచంలోనే అత్యంత ప్రజాదరణ కలిగిన నేతగా మోదీ నిలిచారని పేర్కొన్నారు.

నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం ఎన్నో విజయాలు సాధిస్తోందని, ఆ అవకాశాలను రాష్ట్రం అందిపుచ్చుకోవాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. 2024లో లభించిన చారిత్రక తీర్పు వెనుక ప్రధాని మోదీ, పవన్ కల్యాణ్‌తో ఉన్న మైత్రి కీలక పాత్ర పోషించిందని ఆయన తన ప్రసంగంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి అనగాని సత్యప్రసాద్, ఎంపీ కృష్ణప్రసాద్, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

# 34% బీసీ రిజర్వేషన్లు రద్దు!

ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై నెలకొన్న ఉత్కంఠకు తెరదించుతూ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోలు 104, 1065లను రద్దు చేసింది. మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదన్న సుప్రీంకోర్టు మార్గదర్శకాలను ఈ జీవోలు ఉల్లంఘిస్తున్నాయని స్పష్టం చేసింది. ఆరు వారాల్లోగా ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, ఎన్నికల సంఘాన్ని ఆదేశిస్తూ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్, జస్టిస్ చల్లా గుణరంజన్‌లతో కూడిన ధర్మాసనం తీర్పు ఇచ్చింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల ఖరారు, వార్డుల పునర్విభజన, ఎన్నికల వాయిదా తదితర అంశాలపై దాఖలైన పలు పిటిషన్లపై హైకోర్టు విచారణ చేపట్టింది. బీసీలకు 34% రిజర్వేషన్లు కల్పించడం వల్ల మొత్తం రిజర్వేషన్ల కోటా 50 శాతాన్ని దాటుతోందని, ఇది రాజ్యాంగ విరుద్ధమని పిటిషనర్లు వాదించారు. ఈ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం, రిజర్వేషన్లు 50 శాతం లోపే ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచిస్తూ సదరు జీవోలను కొట్టివేసింది. అదే సమయంలో ఎన్నికల నిర్వహణకు మార్గం సుగమం చేసింది. వార్డుల పునర్విభజన ప్రక్రియలో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. 'సర్' ప్రక్రియ పూర్తయ్యాకే ఎన్నికలు జరపాలంటూ వైసీపీ దాఖలు చేసిన పిటిషన్‌తో పాటు, బీసీ జనాభా గణన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ దాఖలైన వ్యాజ్యాలను కూడా కోర్టు కొట్టివేసింది. గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారుల నియామకాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను సైతం తోసిపుచ్చింది. మొత్తం మీద ఎన్నికల ప్రక్రియను నిలిపివేయడానికి హైకోర్టు నిరాకరించింది. కేవలం రిజర్వేషన్ల శాతాన్ని మాత్రమే సమీక్షించాలని స్పష్టం చేసింది. ఈ తీర్పుతో స్థానిక పోరుకు అడ్డంకులు తొలగిపోయాయి. అయితే, ఇప్పుడు ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల విషయంలో ఎలా ముందుకు వెళుతుంది? కోర్టు నిర్దేశించిన 50 శాతం పరిమితికి లోబడి కొత్త ఫార్ములాను ఎలా రూపొందిస్తుంది? అనేది ఆసక్తికరంగా మారింది. కోర్టు ఆదేశాల మేరకు ఆరు వారాల్లో ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉండటంతో ప్రభుత్వం, ఎన్నికల సంఘంపై ఒత్తిడి పెరిగింది.

## ఫిల్మ్ ఛాంబర్‌లో హైడ్రామా: ఫెడరేషన్ పెద్దలతో జానీ మాస్టర్ భార్య సుమలత వాగ్వాదం..

తెలుగు చలనచిత్ర పరిశ్రమలో మరో వివాదం రాజుకుంది. డాన్సర్స్ అసోసియేషన్‌లో నెలకొన్న విభేదాలు తారాస్థాయికి చేరాయి. గురువారం హైదరాబాద్ ఫిల్మ్ నగర్‌లోని ఫిల్మ్ ఛాంబర్ వద్ద తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. తెలుగు ఫిల్మ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ముఖ్య నాయకుల సమావేశం జరుగుతుండగా, కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ భార్య సుమలత లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించారు. అయితే, ఆమెను లోనికి అనుమతించకపోవడంతో ఫెడరేషన్ పెద్దలతో ఆమె తీవ్ర వాగ్వాదానికి దిగారు. డాన్సర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలిగా ఎన్నికైన తనను కీలక సమావేశానికి పిలవకపోగా, కనీసం లోపలికి కూడా రానివ్వకపోవడంపై సుమలత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫెడరేషన్ నాయకులు తమ సంఘం ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్నారంటూ ఫిల్మ్ ఛాంబర్ బయట ఆందోళన చేపట్టడంతో అక్కడ గందరగోళం ఏర్పడింది.

ఇదిలా ఉండగా, ఇటీవల డాన్సర్స్ అసోసియేషన్‌లో తలెత్తిన వివాదాల నేపథ్యంలో సుమలత నేతృత్వంలోని కార్యవర్గాన్ని రద్దు చేస్తున్నట్లు ఫెడరేషన్ ప్రకటించింది. అంతేకాకుండా, అక్టోబర్ 18న అసోసియేషన్‌కు కొత్తగా ఎన్నికలు నిర్వహించనున్నట్లు స్పష్టం చేసింది. అయితే, ఫెడరేషన్ తీసుకున్న ఈ ఏకపక్ష నిర్ణయం చట్టవిరుద్ధమని, తమను కావాలనే అణచివేస్తున్నారని సుమలత వర్గం ఆరోపిస్తోంది.

మరోవైపు, ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్‌పై గతంలో విధించిన 'సహాయ నిరాకరణ' నిర్ణయాన్ని కొనసాగిస్తున్నట్లు ఫెడరేషన్ తేల్చి చెప్పింది. ఈ పరిణామాలతో డాన్సర్స్ అసోసియేషన్ వివాదం మరింత ముదురుతోంది. ఫెడరేషన్ చర్యలపై న్యాయపరంగా పోరాడతామని సుమలత, జానీ మాస్టర్ మద్దతుదారులు హెచ్చరిస్తున్నారు.

## రిత్రకు జీవం: నిజాంలు నీళ్లు తాగిన బావికి హైడ్రా పునరుజ్జీవం

హైదరాబాద్ నగరం అంటే కేవలం కాంక్రీట్ జంగిల్ కాదు, అడుగడుగునా చారిత్రక వైభవానికి, సాంస్కృతిక వారసత్వానికి నిలువుటద్దం. ముఖ్యంగా పాతబస్తీ గల్లీల్లో తిరిగితే శతాబ్దాల నాటి కథలు మనల్ని పలకరిస్తాయి. అలాంటి ఓ అద్భుతమైన చారిత్రక కట్టడానికి ఇప్పుడు పునరుజ్జీవం లభిస్తోంది. శివరాంపల్లిలోని 356 ఏళ్ల నాటి బుమ్-రుక్న్-ఉద్-దౌలా చెరువును ఇటీవలే పునరుద్ధరించి నగరానికి ఓ మణిహారంగా అందించిన 'హైడ్రా', ఇప్పుడు అదే చెరువు కింద ఉన్న ఓ పురాతన ఊట బావికి ప్రాణం పోస్తోంది. నిజాం నవాబులు సైతం ఔషధ గుణాలున్నాయని భావించి ఈ బావి నీరు తాగినట్టు చరిత్ర చెబుతోంది. అంతటి విశిష్టత కలిగిన ఈ బావి, కాలగర్భంలో కలిసిపోతున్న తరుణంలో హైడ్రా దీని పునరుద్ధరణకు శ్రీకారం చుట్టింది.

**సీఎం ఆదేశాలతో వేగంగా అడుగులు**

గత మార్చి 8వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుమ్-రుక్న్-ఉద్-దౌలా చెరువును ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు. ఆ సమయంలోనే చెరువుకు ఆనుకుని ఉన్న ఈ చారిత్రక బావి ప్రాముఖ్యతను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సీఎం దృష్టికి తీసుకెళ్లారు. దీని చారిత్రక నేపథ్యాన్ని తెలుసుకున్న ముఖ్యమంత్రి, తక్షణమే బావిని పునరుద్ధరించాలని ఆదేశించారు. దీంతో హైడ్రా అధికారులు రంగంలోకి దిగారు. చెరువు అభివృద్ధి పనులను విజయవంతంగా పర్యవేక్షించిన 'విమోస్ టెక్నోక్రాట్స్' సంస్థకే ఈ బావి పునర్నిర్మాణ బాధ్యతలను కూడా అప్పగించారు. ప్రస్తుతం పనులు శరవేగంగా జరుగుతుండగా, మరో రెండు, మూడు నెలల్లో ఈ బావి పూర్వ వైభవాన్ని సంతరించుకోనుంది.

**ఘనమైన చరిత్ర.. మరుగునపడిన వైభవం**

ఒకప్పుడు వంద ఎకరాల్లో విస్తరించిన బుమ్-రుక్న్-ఉద్-దౌలా చెరువు, కాలక్రమేణా కబ్జాలకు గురై కేవలం 4 ఎకరాలకు పరిమితమైంది. దీనిపై దృష్టి సారించిన హైడ్రా, హెచ్‌ఎండీఏ లెక్కల ప్రకారం 17 ఎకరాల భూమిని ఆక్రమణల నుంచి విడిపించి చెరువుకు జీవం పోసింది. ఈ చెరువు కింద 1.50 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఊట బావికి కూడా అంతే ఘనమైన చరిత్ర ఉంది. మూడవ నిజాం సికందర్ జా పాలనలో (సుమారు 1770) ప్రధానమంత్రిగా ఉన్న నవాబ్ రుక్న్-ఉద్-దౌలా పేరు మీదుగా ఈ చెరువును నిర్మించినట్లు చారిత్రక ఆధారాలున్నాయి. చెరువు పరిసరాల్లోని ఔషధ మొక్కల వేర్ల నుంచి ప్రవహించే నీరు, సహజ సిద్ధంగా వడపోతకు గురై ఈ బావిలోకి చేరేదని, అందువల్ల ఈ నీటికి అద్భుతమైన ఔషధ గుణాలుండేవని చరిత్రకారులు చెబుతారు. ఈ స్వచ్ఛమైన నీటిని నిజాం పాలకులు తాగేవారని, ఎడ్ల బండ్లపై సుదూర ప్రాంతాలకు, చివరకు లండన్‌కు కూడా తరలించినట్లు కథలు ప్రచారంలో ఉన్నాయి. కానీ కాలక్రమేణా ఈ బావి ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త, మట్టితో నిండిపోయి తన నీటి నిల్వ సామర్థ్యాన్ని పూర్తిగా కోల్పోయింది.

**వారసత్వ సంపద పరిరక్షణే లక్ష్యం**

హైడ్రా ఈ బావి పునరుద్ధరణను కేవలం ఒక కట్టడాన్ని బాగుచేయడంగా కాకుండా వారసత్వ పరిరక్షణ, పర్యావరణ అభివృద్ధి, ప్రజా ప్రయోజనం అనే మూడు అంశాల సమన్వయంగా భావిస్తోంది. నిర్లక్ష్యానికి గురైన ఈ చారిత్రక సంపదను తిరిగి ప్రజలకు అందించి, భవిష్యత్ తరాలకు నగర జల నిర్వహణ పద్ధతులపై అవగాహన కల్పించడమే తమ లక్ష్యమని హైడ్రా అధికారులు తెలిపారు. బుమ్-రుక్న్-ఉద్-దౌలా చెరువు, దాని కింద ఉన్న ఔషధ గుణాల బావి.. ఇవి హైదరాబాద్‌లోని ప్రకృతి ఆధారిత వైద్య విధానాలకు, నీటి సంరక్షణ జ్ఞానానికి నిలువెత్తు సాక్ష్యాలు. ఈ పునరుద్ధరణతో ఆనాటి వైభవాన్ని కళ్లకు కట్టినట్లు చూపించే ప్రయత్నం జరుగుతోంది.

## కూతురు రాజకీయ ఎంట్రీపై మంత్రి నారాయణ క్లారిటీ!

- మొదటి పేజి తరువాయి

అంటూ తనపై విమర్శలు చేస్తున్న వారిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. తాను ప్రజాసేవ చేయడానికే రాజకీయాల్లోకి వచ్చానని, ప్రజలకు సేవ చేస్తూనే ఉంటానని తెలిపారు. అంతకుముందు, రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి నారాయణ వివరించారు. గత రెండేళ్లలో రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీల అభివృద్ధికి భారీగా నిధులు కేటాయించినట్లు తెలిపారు. విశాఖపట్నం, విజయవాడ నగరాల్లో వేలాది మందికి శాశ్వత నివాస ధ్రువీకరణ పట్టాలు అందించామని చెప్పారు. నెల్లూరులో ఇప్పటికే 1,450 మందికి పట్టాలు ఇచ్చామని, త్వరలోనే మరో 1,250 మందికి అందిస్తామని హామీ ఇచ్చారు. అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లి ఎన్నికల్లో విజయం సాధిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## బీచ్‌లో విషాదం.. ఎనిమిది మంది విద్యార్థుల మృతి

- మొదటి పేజి తరువాయి

లోతు, ప్రవాహాన్ని అంచనా వేయలేక కొట్టుకుపోయారు. సమాచారం అందిన వెంటనే రంగంలోకి దిగిన సహాయక బృందాలు.. ఎనిమిది మంది మృతదేహాలను వెలికితీశాయని పోలీసులు తెలిపారు.

## హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ కు కొత్త బాస్..

దేశంలోని అతిపెద్ద ప్రైవేట్ రంగ బ్యాంకు హెచ్‌డీఎఫ్‌సీకి నూతన సారథి రానున్నారు. బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ), చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈవో)గా అనుప్ బగ్చీని నియమిస్తున్నట్లు బ్యాంక్ బోర్డు ప్రకటించింది. ప్రస్తుత ఎండీ, సీఈవో శశిధర్ జగదీశన్ స్థానంలో ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు. అనుప్ బగ్చీ నియామకంతో పాటు ఆయన వేతన ప్యాకేజీకి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) అక్టోబర్ 1న ఆమోదం తెలిపింది. ఆయన 2026 అక్టోబర్ 27 నుంచి మూడేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగుతారు. బగ్చీ పదవీకాలం 2029 అక్టోబర్ 26న ముగుస్తుంది. ప్రస్తుత సీఈవో శశిధర్ జగదీశన్ పదవీకాలం 2026 అక్టోబర్ 26తో ముగియనున్న నేపథ్యంలో ఈ నియామకం ఖరారైంది. ఐఐటీ కాన్పూర్, ఐఐఎం బెంగళూరు పూర్వ విద్యార్థి అయిన అనుప్ బగ్చీకి బ్యాంకింగ్, ఆర్థిక రంగాల్లో మూడు దశాబ్దాలకు పైగా అనుభవం ఉంది. గతంలో ఆయన ఐసీఐసీఐ గ్రూప్‌లో పలు కీలక పదవుల్లో పనిచేశారు. ప్రస్తుతం ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ ఎండీ, సీఈవోగా వ్యవహరిస్తున్నారు. గతంలో ఐసీఐసీఐ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా, ఐసీఐసీఐ సెక్యూరిటీస్ ఎండీ, సీఈవోగానూ ఆయన సేవలందించారు. బ్యాంకింగ్ రంగంలో అపార అనుభవం కలిగిన బగ్చీ నాయకత్వంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మరింత పురోగతి సాధిస్తుందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి.

## బీసీ రిజర్వేషన్లు: టీడీపీ, వైసీపీలపై విజయసాయి రెడ్డి తీవ్ర విమర్శలు

- మొదటి పేజి తరువాయి

విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34% రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోలను హైకోర్టు రద్దు చేసిన నేపథ్యంలో ఆయన ఈ విధంగా స్పందించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు కలిపి 50 శాతానికి మించకూడదన్న సుప్రీంకోర్టు తీర్పును ఉల్లంఘించేలా ఉన్నాయని పేర్కొంటూ, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవోలను హైకోర్టు కొట్టివేసింది. ఆరు వారాల్లోగా ఎన్నికల ప్రక్రియను ప్రారంభించాలని రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. ఈ తీర్పుపై విజయసాయి రెడ్డి స్పందిస్తూ... రెండు పార్టీలు ఇదే తరహా రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు. "చట్టపరంగా నిలబడవని తెలిసి కూడా రిజర్వేషన్లు 50 శాతం పరిమితిని దాటేలా ప్రభుత్వం జీవోలు ఇవ్వడం, ఆ తర్వాత దానికి వ్యతిరేకంగా వెనువెంటనే కోర్టుల్లో కేసులు వేయించడం వీరికి పరిపాటిగా మారింది" అని ఆయన ఆరోపించారు. ఈ విధంగా బీసీలను మభ్యపెట్టి, కోర్టు తీర్పులు రాగానే ఒకరిపై ఒకరు నిందలు వేసుకుంటూ రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని ఆయన మండిపడ్డారు.

## యు-19 ఇంటర్ స్కూల్ గేమ్స్ లో తైక్వాండో విద్యార్థినీ విద్యార్థులు విజయం

**అంబాజీపేట, పెన్ పవర్, అక్టోబరు 1:** గత నెల 30వ తేదీన కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ లో తైక్వాండో విద్యార్థులు తమ ప్రతిభను చాటి విజయం సాధించారు. ఈ పోటీలలో పి చరణ్యశ్రీ యు/44 కేజీ కేటగిరి, ఆర్.హెచ్.వి. మూర్తి యు/68 కేజీ క్యాటగిరీలో మొదటి స్థానం సాగించారు. త్వరలో జరుగు రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ తైక్వాండో పోటీలకు ఎంపికైనారు. వీరిని ప్రజా ప్రతినిధులు, క్రీడాకారులు ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు విద్యా కమిటీ చైర్మన్ లు అభినందించారు. కోచ్: పి భార్గవి శ్రీకళ రిఫరీ గా. టి. రాజశేఖర్. ఆర్. దివ్య లు పాల్గొన్నారు.



# పెన్ పవర్

కాకినాడ

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

# స్థానిక సంస్థల ఎన్నికలకు పకడ్బందీగా సన్నద్ధం కావాలి



**కాకినాడ, పెన్ పవర్ అక్టోబర్ 1 :**త్వరలో నిర్వహించనున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ, వార్డు మెంబర్లు, సర్పంచుల ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు అధికారులు పూర్తి స్థాయిలో సన్నద్ధం కావాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ నుంచి ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన కలెక్టర్ స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధతపై సమీక్షించారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా ప్రతి అంశాన్ని ముందుగానే ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని సూచించారు.ప్రతి పోలింగ్ కేంద్రంలో విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు, ర్యాంపులు, ఫర్నిచర్ తదితర కనీస వసతులు తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలకు ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు స్పష్టంగా ఉండేలా చూడాలని, అవసరమైతే ప్రత్యామ్నాయ పోలింగ్ కేంద్రాలను ముందుగానే గుర్తించి నిబంధనల ప్రకారం వివరాలను ప్రకటించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు.శిథిలావస్థకు చేరిన భవనాలపై సంబంధిత ఇంజనీర్ల నుంచి ధ్రువీకరణ నివేదికలు తీసుకోవాలని, అవసరమైన మరమ్మతు పనులకు ప్రతిపాదనలు సమర్పించి సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. నిబంధనల ప్రకారం అత్యంత సమస్యాత్మక, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి, ఆయా కేంద్రాలకు అవసరమైన అదనపు భద్రతా ఏర్పాట్ల కోసం ముందుగానే పోలీస్ శాఖకు ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్ ఆదేశించారు.ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామగ్రిని ముందుగానే సమకూర్చుకోవాలని, అవసరమైన బ్యాలెట్ బాక్సులను సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. రిటర్నింగ్ అధికారులు ఎన్నికల సంఘం ప్రచురించిన 'హ్యాండ్‌బుక్ ఫర్ ఆర్వో'ను పూర్తిగా అధ్యయనం చేసి, అందులోని నిబంధనలు, విధివిధానాలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. ప్రిసైడింగ్ అధికారులు కూడా తమ విధులు, బాధ్యతలపై ముందుగానే పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు.మాస్టర్ ట్రైనీలను ముందుగానే ఎంపిక చేసి జాబితా సిద్ధం చేయడంతో పాటు ఎన్నికల సిబ్బందికి అవసరమైన శిక్షణను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని తెలిపారు. సమర్థులైన అధికారులను ప్రిసైడింగ్ అధికారులుగా ఎంపిక చేయాలని సూచించారు. ప్రతి మండలంలో ఎన్నికల సామగ్రి పంపిణీకి డిస్ట్రిబ్యూషన్ సెంటర్, పోలింగ్ అనంతరం సామగ్రి స్వీకరణకు రిసెప్షన్ సెంటర్‌లను ముందుగానే గుర్తించి అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.ఎన్నికల నిర్వహణలో భాగంగా రూట్లు, సెక్టార్లు, జోన్లను ముందుగానే విభజించి, ప్రతి ప్రాంతానికి తగిన అధికారులు,సిబ్బందిని కేటాయించేలా కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ తెలిపారు. గ్రామస్థాయిలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా ప్రజలకు అవసరమైన అవగాహన కల్పిస్తూ ముందస్తు చర్యలు చేపట్టాలని, ఎలాంటి వివాదాలకు తావులేకుండా స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా,స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించడం అధికారులందరి బాధ్యత అని కలెక్టర్ స్పష్టం చేశారు.వీడియో కాన్ఫరెన్స్‌లో డీపీఓ పి.రవికుమార్,జడ్పీ సీఈవో వి.వి.వి.ఎస్. లక్ష్మణరావు,ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాని నరేంద్ర మోడీపై అనుచిత వాఖ్యలు చేసిన వ్యక్తిపై తక్షణమే చర్యలు తీసుకోవాలి.

-కిర్లంపూడి పోలీస్ స్టేషన్లో లో బిజెపి నాయకులు ఫిర్యాదు.



**కిర్లంపూడి, పెన్ పవర్, అక్టోబర్, 01:** భారత ప్రధాని నరేంద్ర మోడీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కిర్లంపూడి ఎస్సై,జి సతీష్ కుమార్ కు కిర్లంపూడి మండలం భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు శరకణం రాజబాబు ఆధ్వర్యంలో బిజెపి నాయకులు గురువారం ఫిర్యాదు చేశారు. రాష్ట్ర బిజెపి అధ్యక్షులు పివిఎన్ మాధవ్ ఆదేశాలతో, కాకినాడ జిల్లా బిజెపి అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వరరావు సూచనతో భారతీయ జనతా పార్టీ కాకినాడ జిల్లా తరపున ఈ ఫిర్యాదు చేస్తున్నామన్నారు.
మా దృష్టికి వచ్చిన ఒక వీడియోలో ఒక వ్యక్తి ప్రధానమంత్రి నరేంద్ర మోడీతోపాటు వారి తల్లిని ఉద్దేశించి అత్యంత అసభ్యకరమైన అవమానకరమైన పదజాలాన్ని ఉపయోగిస్తూ వాఖ్యలు చేసినట్టు స్పష్టంగా కనిపిస్తుందన్నారు.సంబంధిత వీడియోలు ఈ ఫిర్యాదులతో పాటు ఆధారంగా సమర్పిస్తున్నామన్నారు.
ప్రధానమంత్రి పదవిలో ఉన్న నరేంద్ర మోడీ వారి తల్లిని ఉద్దేశించి ఈ విధంగా అసభ్యకరమైన భాషను ఉపయోగించడం పట్ల భారతీయ జనతా పార్టీ కాకినాడ జిల్లా శాఖ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. సంబంధిత వీడియోను పరిశీలించి అందులో వాఖ్యలు చేసిన వ్యక్తిని గుర్తించి వీడియో ఎక్కడ ఎప్పుడు చూపించబడింది ఎవరి ద్వారా సోషల్ మీడియాలో ప్రచారం చేయబడింది అనే అంశంపై సమగ్రంగా విచారణ జరిపి,చట్ట ప్రకారం తగిన కఠినమైన చర్యలు తీసుకోవాలని ఎస్సై, జి సతీష్ ను కోరారు. ఈ కార్యక్రమంలో కాకినాడ జిల్లా ఓబీసీ ఉపాధ్యక్షులు కంటా కాశీవిశ్వనాథం, మండల ఓబిసి అధ్యక్షులు పెంటకోట సత్యనారాయణ, మండల కార్యదర్శి కోలా కృష్ణ ఉన్నారు.

## ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ ను మర్యాదపూర్వకంగా కలసిన చదలవాడ బాబి.

**-కిర్లంపూడి, పెన్ పవర్, అక్టోబర్, 01:** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సమక్షంలో కిర్లంపూడి సొసైటీ మాజీ చైర్మన్ చదలవాడ బాబీ ఇటీవల పిఠాపురంలో జనసేన పార్టీలో జాయిన్ అయిన సందర్భంగా కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ ను ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. బాబితోపాటు కిర్లంపూడి మండలం జనసేన పార్టీ అధ్యక్షులు గంధం ప్రభాకర్ నంది రాజా తదితరులు ఉన్నారు.



## భవన నిర్మాణ కార్మికుల 10 లక్షల ప్రమాద బీమా ఆన్ లైన్ తోపాటు ఆఫ్ లైన్ పద్ధతిని కొనసాగించాలి.

-డిప్యూటీ తహసీల్దార్ కు భవన నిర్మాణ కార్మికులు వినతి.



**కిర్లంపూడి/ప్రత్తిపాడు,అక్టోబర్, 01:**భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు పథకాలు నుండి ప్రమాద బీమా 10 లక్షల రూపాయలు పరిహారం ఇవ్వాలని ,ఆన్ లైన్ తోపాటు ఆఫ్ లైన్ పద్ధతిని కొనసాగించాలని కోరుతూ ఏపీ బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక మండల డిప్యూటీ తహశీల్దార్ కు భవన కార్మికులు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు నిట్ల శ్రీను మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం భవన కార్మికుల సంక్షేమ బోర్డు నుండి పథకాలన్నీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో ప్రమాదాలకు గురై దరఖాస్తు చేసుకున్న కార్మికులు ఏడు ఏళు ్లగా పరిహారాల కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. సంక్షేమం బోర్డులో నిధులు పుష్కలంగా ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడంలో పూర్తి నిర్లక్ష్యం వహిస్తుందని అన్నారు. రాష్ట్రంలో 4500 కోట్ల రూపాయలు బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డులో నిధులు మూలుగుతున్నాయని, వెల్ఫేర్ బోర్డు ప్రారంభం నుండి ఇప్పటివరకు కేవలం 1500 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టారని ఈ సందర్భంగా అన్నారు.ప్రక్కనే ఉన్న కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలలో ప్రమాదాల్లో చనిపోయిన భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలను ఆదుకోవడానికి 10 లక్షల రూపాయలు ప్రమాద బీమా అమలు చేస్తున్నారని అన్నారు .మన రాష్ట్రంలో గతంలో 5 లక్షల రూపాయలు ఇచ్చే వారిని ఈ కాలంలో దాన్ని కూడా ఆపేసారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అరకొరగా అమలు జరిగే పథకాలు కూడా లేబర్ ఆఫీసులో అప్లికేషన్ నేరుగా తీసుకోవడం లేదని ,ఆన్ లైన్ లో నమోదు చేసుకోమని అధికారులు చెబుతున్నారని ఈ సందర్భంగా అన్నారు. ఆన్ లైన్ లో నమోదు చేసుకునే సామర్థ్యమే ఉంటే భవననిర్మాణ కార్మికులు గా కాకుండా సాఫ్ట్వేర్ ఉద్యోగులుగా ఉండేవారమని ఎద్దేవా చేశారు.ఈ కార్యక్రమంలో భవన కార్మికులు మర్రి గోవిందు,టి.రాజా,ఎం.శ్రీను,ఎం,నాగేశ్వరరావ ు,ఎం.మణేశ్వరరావు,జి. రామాంజనేయులు,జి.రాము,ఎం.రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

# తాళ్లూరులో 'పేదల సేవలో 2.0'కు శ్రీకారం



ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



**గండేపల్లి, పెన్ పవర్,(తాళ్లూరు) అక్టోబర్ 1:** గండేపల్లి మండలం తాళ్లూరు గ్రామంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'పేదల సేవలో 2.0' గ్రామసభ కార్యక్రమం గురువారం ఘనంగా ప్రారంభమైంది. కార్యక్రమానికి జగ్గంపేట ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యులు, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు జ్యోతుల నెహ్రూ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.
కార్యక్రమానికి ముందు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తాళ్లూరు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ఎన్టీఆర్ సామాజిక పింఛన్లను లబ్ధిదారులకు స్వయంగా అందజేశారు. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో సంక్షేమ పాలనకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వృద్ధుల పింఛన్‌ను రూ.3 వేల నుంచి రూ.4 వేలకు, విభిన్న ప్రతిభావంతుల పింఛన్‌ను రూ.3 వేల నుంచి రూ.6 వేలకు, మంచానికే పరిమితమైన వారికి అందించే పింఛన్‌ను రూ.10 వేల నుంచి రూ.15 వేలకు పెంచినట్లు తెలిపారు.జగ్గంపేట నియోజకవర్గంలో 42 వేలకుపైగా ఎన్టీఆర్ సామాజిక పింఛన్లు అందుతున్నాయని, కొత్త పింఛన్ల కోసం కూడా పలువురు దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. ఒక్క తాళ్లూరు గ్రామంలోనే 620 మంది లబ్ధిదారులకు ప్రతి నెలా రూ.25.91 లక్షల మేర ఆర్థిక సహాయం అందుతోందన్నారు.'పేదల సేవలో 2.0' కార్యక్రమం కేవలం ఒక కార్యక్రమం కాదని, ప్రజలతో ప్రభుత్వానికి ప్రత్యక్ష అనుసంధాన వేదిక అని ఎమ్మెల్యే తెలిపారు. అక్టోబర్ 1, 2026 నుంచి డిసెంబర్ 31, 2027 వరకు 15 నెలలపాటు రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో ప్రతి సచివాలయ క్లస్టర్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడం, అర్హులను గుర్తించడం, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా 15 రోజుల్లో సమస్యలను పరిష్కరించడం, 'పి4' మార్గదర్శి అనుసంధానం ద్వారా బంగారు కుటుంబాలకు అండగా నిలవడం కార్యక్రమంలోని ప్రధాన అంశాలన్నారు.
అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను ఎమ్మెల్యే పరిశీలించారు. డ్వాక్రా, స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను ప్రదర్శించేందుకు ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మహిళల ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించడంతో పాటు బ్యాంకు రుణాలు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. రక్తపోటు, రక్తంలో చక్కెర స్థాయిలతో పాటు ఇతర ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు.జగ్గంపేట నియోజకవర్గంలో ప్రజలను అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములను చేస్తూ ప్రతి గ్రామాన్ని సంక్షేమం, అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు.కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ సత్యనారాయణ, మార్కెట్ కమిటీ చైర్మన్ అడపా భరత్, రాష్ట్ర డైరెక్టర్లు పోతుల మోహనరావు, కొత్త కొండబాబు, ఎస్.వి.ఎస్. అప్పలరాజు, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు కందుల చిట్టిబాబు, క్లస్టర్ ఇన్‌చార్జి జాస్తి వసంత్, అన్నవరం బోర్డు సభ్యుడు పాలచర్ల నాగేంద్ర చౌదరి, గ్రామ నాయకులు పి. వెంకటేశ్వరరావు, పాలచర్ల సత్యనారాయణ, ఎస్. వీరబాబు, కోండ్రు అప్పలరాజు, సొసైటీ డైరెక్టర్ వీరబాబు, అమ్మన్న చౌదరి, వాసు, విద్యా కమిటీ చైర్మన్ జే. సత్తిబాబు, తహసీల్దార్ పద్మజ, ఎంపీడీవో హరికృష్ణ సత్యారెడ్డి, స్వర్ణాంధ్ర విజన్ 2047 సిబ్బంది, గ్రామ సచివాలయ సిబ్బంది, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.



## అర్నబ్ తుఫాను పంట నష్టాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా వ్యవసాయ అధికారి



**కాజులూరు, పెన్ పవర్,అక్టోబర్ 1:** అర్నబ్ తుఫాను ప్రభావంతో దెబ్బతిన్న వరి పంటను జిల్లా వ్యవసాయ అధికారి వి.టి. రామారావు కోలంక గ్రామంలో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతులతో మాట్లాడి పంట నష్టం, నీటిముంపు పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం జిల్లాలో వరి పంట పిలకలు పెట్టే దశ నుంచి పొట్టలు ఏర్పడే దశలో ఉన్నందున ఎడతెరిపిలేని వర్షాల కారణంగా పంటకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని తెలిపారు.33 శాతానికి పైగా పంట నష్టం వాటిల్లిన పొలాలను గుర్తించి, హెక్టారుకు రూ.17 వేల చొప్పున ప్రభుత్వం ద్వారా ఇన్‌పుట్ సబ్సిడీ అందించనున్నట్లు తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 12,515 హెక్టార్లలో వరి పంట నష్టం జరిగినట్లు ప్రాథమికంగా అంచనా వేయగా, అందులో 6,500 హెక్టార్ల వివరాలను ఇప్పటికే ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు వెల్లడించారు.నీరు నిలిచి అనంతరం తొలగిన పొలాల్లో పంటను కాపాడుకునేందుకు రైతులు ఎకరానికి 10 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ కలిపి పొలంలో జల్లుకోవాలని సూచించారు. ఎండాకు తెగులు, దుబ్బు తెగులు నివారణకు లీటరు నీటికి 2 మి.లీ. ప్రాపికోనజోల్, 1 గ్రాము ప్లాంటోమైసిన్ కలిపి పిచికారీ చేయాలని సూచించారు.పంట నష్ట వివరాలను నమోదు చేసుకునేందుకు అక్టోబర్ 5, 2026 వరకు గడువు ఉందని జిల్లా వ్యవసాయ అధికారి తెలిపారు. అక్టోబర్ 6, 7, 8 తేదీల్లో నమోదు చేసిన వివరాల జాబితాలను రైతు సేవా కేంద్రాలు (ఆర్ఎస్‌కే), గ్రామ సచివాలయాల్లో ప్రదర్శిస్తామని చెప్పారు. జాబితాలపై రైతుల నుంచి వచ్చే అభ్యంతరాలను పరిశీలించి, అవసరమైన సవరణలు చేసిన అనంతరం అక్టోబర్ 10న జిల్లా కలెక్టర్ అనుమతితో తుది జాబితాను ప్రభుత్వానికి పంపనున్నట్లు వివరించారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వి.అశోక్,కోలంక పీఏసీఎస్ అధ్యక్షులు బొండా వెంకట నరసింహ నాయుడు,వ్యవసాయ విస్తరణాధికారి ప్రశాంత్, వీఏఏ వి. సాయి ప్రసన్న,రైతులు బుచ్చిబాబు, నరసింహరాజు, రామచంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

## కోలంక సొసైటీని సందర్శించిన జిల్లా వ్యవసాయ అధికారి



**కాజులూరు, పెన్ పవర్ అక్టోబర్ 1:** జిల్లా వ్యవసాయ అధికారి వి.టి. రామారావు కోలంక సొసైటీ, రైతు సేవా కేంద్రాన్ని సందర్శించారు. కోలంక సొసైటీ అధ్యక్షులు బొండా వెంకట నరసింహ నాయుడు ఆయనకు స్వాగతం పలికారు.ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి రామారావు కొంతసేపు స్థానిక రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.రైతులకు ఎరువులు సకాలంలో అందుతున్నాయా,ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల పంటలకు, వ్యవసాయ పనులకు ఎదురైన ఇబ్బందులు ఏమిటనే విషయాలను అడిగి తెలుసుకున్నారు.రైతులకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు వ్యవసాయ శాఖ తరఫున తీసుకుంటున్న చర్యలను వివరించారు.కార్యక్రమంలో కాజులూరు మండల జనసేన పార్టీ అధ్యక్షులు బొండా వెంకన్న, మండల వ్యవసాయ అధికారి వి. అశోక్, కోలంక సొసైటీ అధ్యక్షులు బొండా వెంకట నరసింహ నాయుడు, వ్యవసాయ విస్తరణాధికారి ప్రశాంత్, వీఏఏ వి.సాయి ప్రసన్నతో పాటు రైతులు బుచ్చిబాబు,నరసింహరాజు, రామచంద్రరాజు,నందికొల్ల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.ద

## వృద్ధాప్యంలో పెద్దలకు తోడుగానిలవాలి



**కాకినాడ, పెన్ పవర్,అక్టోబర్ 1:** చిన్నతనంలో మనకు నడక నేర్పిన పెద్దలకు వృద్ధాప్యంలో తోడుగా నిలవడమే మనం వారికి ఇచ్చే అతిపెద్ద గౌరవమని శ్రీ సత్య దంత వైద్యశాల వైద్యులు డా. అడ్డాల సత్యనారాయణ అన్నారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా స్థానిక రెడ్ క్రాస్ సొసైటీ వృద్ధాశ్రమంలో డా. అడ్డాల సత్యనారాయణ ఆధ్వర్యంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా డా.అడ్డాల మాట్లాడుతూ ప్రతి సంవత్సరం అక్టోబర్ 1న అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఐక్యరాజ్యసమితి సాధారణ అసెంబ్లీ 1990 డిసెంబర్ 14న ఆమోదించిన తీర్మానం మేరకు 1991 అక్టోబర్ 1 నుంచి ప్రపంచవ్యాప్తంగా ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారని వివరించారు. సమాజం, కుటుంబం, దేశ ప్రగతిలో వయోవృద్ధులు అందించిన సేవలను స్మరించుకోవడం, వృద్ధాప్యంలో ఎదురయ్యే శారీరక, మానసిక, ఆర్థిక, సామాజిక సమస్యలపై ప్రజల్లో అవగాహన కల్పించడం ఈ దినోత్సవం ప్రధాన ఉద్దేశమన్నారు.వృద్ధులను నిర్లక్ష్యం చేయకుండా, హింస, వివక్షకు గురికాకుండా చూడడంతో పాటు వారి ప్రాథమిక హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.రోజువారీ జీవితంలో వృద్ధులతో కొంత సమయం గడపడం, వారి మాటలను శ్రద్ధగా వినడం, వారి జీవిత అనుభవం, జ్ఞానాన్ని తరువాతి తరాలకు మార్గదర్శకంగా ఉపయోగించుకోవాలని సూచించారు. వృద్ధుల ఆహారం,మందులు,ఆరోగ్యం, మానసిక ఉల్లాసంపై కుటుంబ సభ్యులు, సమాజం క్రమం తప్పకుండా శ్రద్ధ వహించాలని కోరారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ రామ్ చరణ్,వీరభద్రరావు,రెడ్ క్రాస్ వృద్ధాశ్రమంలోని వృద్ధులు పాల్గొన్నారు.

# పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం





- రాష్ట్రవ్యాప్తంగా పోషణ మాసోత్సవాలు
- లబ్ధిదారులు అవగాహన పెంపొందించుకోవాలి
- అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారాన్ని అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలి: పోతుల మోహనరావు

**గండేపల్లి, పెన్ పవర్, అక్టోబర్ 01** పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా జీవించవచ్చని టీడీపీ మండల అధ్యక్షుడు, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ పోతుల మోహన్రావు అన్నారు. గురువారం మండల పరిధి తాళ్లూరు పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన గ్రామ సభలో వై వి లక్ష్మి నిర్వహించిన అంగనవాడి కేంద్రం ద్వారా అందిస్తున్న ఐ సి డి ఎస్ స్టాల్స్ ను ఆయన నాయకులు కార్యకర్తలతో కలసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అర్హులైన లబ్ధిదారులకు ఉచితంగా అందిస్తున్న పౌష్టికాహారాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మాతా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, మూడు నుంచి ఆరు సంవత్సరాల వయస్సు గల చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తున్నట్లు తెలిపారు.పాలు, చిక్కీలు, ఖర్జూరం, బెల్లం, కోడిగుడ్లు, బాలామృతం వంటి పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను ప్రభుత్వం అందిస్తోందన్నారు. అంతేగాక ఆకుకూరలు కూరగాయలు యొక్క విశిష్టత తెలియపరిచారు. ముఖ్యంగా మునగాకు ఎంతో అమూల్యమైనదని దీనిని ప్రతి ఒక్కరూ తీసుకోవడం ద్వారా మంచి ఆరోగ్యం లభిస్తుంది అన్నారు. ముఖ్యంగా తల్లులు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు పౌష్టికాహారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. అర్హులైన లబ్ధిదారులు అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందించే ఆహారాన్ని తప్పనిసరిగా తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని పోతుల మోహన్రావు కోరారు. అనంతరం స్టాల్స్ లో ఏర్పాటు చేసిన పదార్థాలను ప్రజలకు చూపించి తప్పనిసరిగా అందరూ తీసుకోవాలని అన్నారు. దీని వెంట గ్రామ సర్పంచ్ వీరబాబు, వెంకటేశ్వరరావు, జాస్తి వసంత్, వాసు, పాలచర్ల సత్యనారాయణ , సీఎం ఎల్లమెల్లి, నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

# రక్తదానం బాధ్యతగా అలవర్చుకోవాలి






**కలెక్టర్ హరేంధిర ప్రసాద్**

**కాకినాడ, పెన్ పవర్,అక్టోబర్ 1:** ప్రాణాపాయంలో ఉన్నవారిని ఆదుకోవడంలో రక్తదానం అత్యంత కీలకమని, యువత రక్తదానాన్ని ఒక బాధ్యతగా అలవర్చుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పిలుపునిచ్చారు. జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం సందర్భంగా కాకినాడలోని పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరాన్ని అసిస్టెంట్ కలెక్టర్ ప్రియ, రాష్ట్ర ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ వై.డి. రామారావు, హెచ్‌డీఎఫ్‌సీ మేనేజర్ అనంతకుమార్ తదితరులతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు.ఈ సందర్భంగా రక్తదానం చేస్తున్న విద్యార్థులతో కలెక్టర్ ఆప్యాయంగా మాట్లాడి అభినందించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అవయవదానం ఎంత గొప్పదో, రక్తదానం కూడా అంతే ప్రాముఖ్యత కలిగిన సేవ అని పేర్కొన్నారు. అత్యవసర చికిత్స పొందుతున్న రోగులు, పేద కుటుంబాలకు రక్తం అవసరం ఉన్న సమయంలో రెడ్ క్రాస్ సంస్థ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు. కాకినాడ రెడ్ క్రాస్ చాప్టర్‌కు రాష్ట్రస్థాయిలో గుర్తింపు లభించడం గర్వకారణమని తెలిపారు.యువత ఆరోగ్యాన్ని కాపాడుకుంటూనే సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని సూచించారు. పౌష్టికాహారం తీసుకుంటూ రక్తహీనతకు దూరంగా ఉండాలని, జంక్‌ఫుడ్‌కు అలవాటు పడకూడదన్నారు. మద్యం, గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఆరోగ్యవంతులు క్రమం తప్పకుండా రక్తదానం చేయడం ద్వారా ఎంతోమంది ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని తెలిపారు. విద్యార్థి దశ నుంచే సేవా గుణాన్ని అలవర్చుకుని రెడ్ క్రాస్ వాలంటీర్లుగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.రాష్ట్ర ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ వై.డి. రామారావు మాట్లాడుతూ రక్తదాన ఉద్యమాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా స్వీకరించి ఆపదలో ఉన్న ప్రాణాలను కాపాడాలని కోరారు. రాష్ట్రంలోని 20 బ్లడ్ బ్యాంకుల ద్వారా ఏటా సుమారు లక్ష యూనిట్ల రక్తాన్ని ప్రజలకు అందిస్తున్నామని తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు ప్రతి మంగళవారం ఉచితంగా రక్త మార్పిడి చేస్తున్నామని వివరించారు. రక్తాన్ని కొనుగోలు చేసే విధానం నుంచి స్వచ్ఛంద రక్తదాన సంస్కృతికి సమాజం మారాల్సిన అవసరం ఉందన్నారు.అసిస్టెంట్ కలెక్టర్ ప్రియ మాట్లాడుతూ విద్యార్థులు బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదిగి దేశాభివృద్ధికి స్వచ్ఛంద సేవా కార్యక్రమాల ద్వారా తమ వంతు సహకారం అందించాలని సూచించారు. హెచ్‌డీఎఫ్‌సీ మేనేజర్ అనంతకుమార్ మాట్లాడుతూ తమ సంస్థ సామాజిక బాధ్యతలో భాగంగా ఇప్పటివరకు సుమారు ఆరు లక్షల యూనిట్ల రక్తాన్ని సేకరించిందన్నారు. రక్తదానంపై ఉన్న అపోహలను తొలగించి ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటూ రక్తదానం చేయాలని కోరారు. కార్యక్రమంలో పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎం.వీకే. మెహర్,బ్లడ్ డొనేషన్ క్యాంపు కన్వీనర్ డా. పి.కిరణ్‌కుమార్,అధ్యాపకులు ఆంజనేయులు, సామ్యేల్, కళాశాల ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# కత్తిపూడి జడ్పీ హైస్కూల్‌లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



వారి



**పదో తరగతి ఫలితాలపై ప్రత్యేక దృష్టి**

**కత్తిపూడి/కాకినాడ, పెన్ పవర్,అక్టోబర్ 1 :**కత్తిపూడి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ గురువారం అసిస్టెంట్ కలెక్టర్ ప్రియతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం, తాగునీటి సదుపాయాలు, మరుగుదొడ్ల నిర్వహణ, మధ్యాహ్న భోజనం నాణ్యత తదితర అంశాలను పరిశీలించారు. రిజిస్టర్లను తనిఖీ చేసి పాఠశాల నిర్వహణకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.అనంతరం 9, 10వ తరగతి విద్యార్థులతో కలెక్టర్ నేరుగా మాట్లాడి విద్యా ప్రమాణాలు, అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులు చదువులో మరింతగా రాణించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు.ఈ సందర్భంగా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ, రానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలను దృష్టిలో ఉంచుకుని ఇప్పటి నుంచే విద్యార్థులకు ఉదయం, సాయంత్రం వేళల్లో క్రమం తప్పకుండా ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. పదో తరగతి పరీక్షల్లో అత్యధిక ఉత్తీర్ణత శాతం సాధించే లక్ష్యంతో రాష్ట్ర విద్యాశాఖ ప్రవేశపెట్టిన మిషన్-2027 కార్యక్రమాన్ని పాఠశాలలో పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు.ప్రతి విద్యార్థి విద్యా పురోగతిపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి అవసరమైన అదనపు బోధన అందించాలని తెలిపారు. అలాగే ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం మెనూ ప్రకారం నాణ్యతతో, రుచికరంగా విద్యార్థులకు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.కలెక్టర్ వెంట పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్.వీ.వీ. సత్యనారాయణ, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

# అన్నయ్యపేట పాఠశాలలో మంత్రి సుభాష్ ఆకస్మిక తనిఖీ





**రామచంద్రపురం రూరల్, పెన్ పవర్,అక్టోబర్ 1 :**పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పోషకాహారం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. గురువారం రామచంద్రపురం రూరల్ మండలం అన్నయ్యపేట ప్రభుత్వ పాఠశాలను మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు.పాఠశాల ఆవరణ, తరగతి గదులు, పారిశుద్ధ్య పరిస్థితులు, తాగునీటి సౌకర్యాలను పరిశీలించి పాఠశాల సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం విద్యార్థులతో ఆప్యాయంగా ముచ్చటించి వారికి అందుతున్న విద్యా సదుపాయాలు, మధ్యాహ్న భోజనం నాణ్యత, పాఠశాలలోని వసతులపై ఆరా తీశారు. విద్యార్థుల అభిప్రాయాలు,సమస్యలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, విద్యార్థులతో కలిసి మంత్రి సుభాష్ నేలపై కూర్చుని మధ్యాహ్న భోజనం చేశారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యతను స్వయంగా పరిశీలించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు.విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పోషకాహారం అందించడం ద్వారా వారి భవిష్యత్తును బలోపేతం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. విద్యార్థి దశ ఎంతో కీలకమని, చిన్న వయస్సు నుంచే స్పష్టమైన లక్ష్యాలను ఏర్పరచుకుని క్రమశిక్షణతో చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని సూచించారు.ప్రతి విద్యార్థి తనలోని ప్రతిభను గుర్తించి అందుకు అనుగుణంగా కృషి చేయాలని, విద్యతో పాటు మంచి విలువలను అలవర్చుకోవాలని మంత్రి హితవు పలికారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని తల్లిదండ్రులకు,పాఠశాలకు, సమాజానికి మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులను ప్రోత్సహించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, కూటమి పార్టీల నాయకులు,ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆదిత్య యూనివర్సిటీలో ఘనంగా జాతీయ స్వచ్ఛంద రక్తదాన శిబిరం



**గండేపల్లి, పెన్ పవర్, అక్టోబర్ 01:**గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో జాతీయ 2, 7 యూనిట్ల ఆధ్వర్యంలో, పెద్దాపురం రోటరీ రక్తనిధి సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.యూనివర్సిటీ ఉప ప్రధాన కులపతి డా. ఎం. శ్రీనివాస రెడ్డి, విద్యార్థి కార్యకలాపాల విభాగం డీన్ డా. డి. కిషోర్ శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో విస్తరణ కార్యకలాపాల సమన్వయకర్త డా. ఐ.వి. వీరాంజనేయులు, ఎన్ఎస్ఎస్ కార్యక్రమ అధికారులు, స్వచ్ఛంద సేవకులు, విద్యార్థులు, రక్తదాతలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా రక్తదానం ప్రాధాన్యతను నిర్వాహకులు వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమైన వారికి రక్తదానం ద్వారా సహాయం చేయడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. విద్యార్థులు, ఇతర రక్తదాతలు ఉత్సాహంగా పాల్గొని మొత్తం 115 యూనిట్ల రక్తాన్ని దానం చేశారు.సామాజిక సేవా కార్యక్రమాల్లో విద్యార్థులు చురుకుగా పాల్గొనడం అభినందనీయమని యూనివర్సిటీ ప్రతినిధులు తెలిపారు. స్వచ్ఛంద రక్తదానంపై యువతలో అవగాహన పెంపొందించడంతో పాటు, అవసరమైన వారికి రక్తం అందించేందుకు సహకరించాలనే సామాజిక బాధ్యతను పెంపొందించడమే ఈ శిబిరం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

# ఆలమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు ప్రశంసనీయం



- జిల్లా డీఐఈవో కె చంద్రశేఖర్ బాబు
- రాష్ట్రంలో మరే ప్రభుత్వ కళాశాలలో విద్యార్థినులకు ఉచిత ఆటోల సౌకర్యం లేదని వ్యాఖ్య

**ఆలమూరు, పెన్ పవర్, అక్టోబర్ 01:**ఆలమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు చాలా బాగున్నాయని కోనసీమ జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి (డిస్ట్రిక్ట్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్)డీఐఈవో కె చంద్రశేఖర్ బాబు అభినందించారు. గురువారం ఆయన ఆకస్మికంగా ఆలమూరు జూనియర్ కళాశాలను సందర్శించి విద్యార్థినీ విద్యార్థులతో మాట్లాడారు. ఆలమూరు ఎడ్యుకేషనల్ ట్రస్ట్ తరపున విద్యార్థులకు ఉచిత ఫీజు, పుస్తకాలు అందుతున్న విషయం తెలుసుకున్నారు. ప్రముఖ పారిశ్రామికవేత్త వంటిపల్లి పాపారావు సౌజన్యంతో విద్యార్థినులకు అందుతున్న ఉచిత ఆటోల సౌకర్యం గురించి తెలుసుకొని సంతోషం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోనే మరే ఇతర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇటువంటి ఉచిత ఆటోల సౌకర్యం విద్యార్థినులకు లేదని, దాతల సహకారంతో ఈ కళాశాలలో ఉచిత ఆటోల సౌకర్యం ఉండడం ప్రశంసనీయమన్నారు. తాము ఈ సౌకర్యం ఉన్నందువల్లే తాతపూడి, నర్సిపూడి వంటి ప్రయాణ సౌకర్యాలు లేని గ్రామాల నుంచి సైతం వచ్చి ఈ కళాశాలలో చదువుకుంటున్నామని విద్యార్థినులు ఆయనకు తెలియజేశారు. విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తూ ప్రభుత్వ విద్యను ప్రోత్సహిస్తున్న ఆలమూరు ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్, దాతలు, ప్రిన్సిపల్ సురేష్ రెడ్డి, అధ్యాపకులను ఆయన అభినందించారు.

# ఆరోగ్య రంగంలో ఏఐ వినియోగంపై అవగాహన

16 విశ్వవిద్యాలయాలు, 20 అనుబంధ కళాశాలల నుంచి 450 మందికి పైగా విద్యార్థుల హాజరు



**గండేపల్లి, పెన్ పవర్, అక్టోబర్ 01** సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ ఫార్మసీ ఆధ్వర్యంలో ఆరోగ్య రంగంలో కృత్రిమ మేధస్సు (ఏఐ) వినియోగంపై అవగాహన కల్పించేందుకు 'ఏఐ స్పైర్--2026' కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల్లో ఏఐపై అవగాహన, సృజనాత్మకత, ప్రాక్టికల్ నైపుణ్యాలను పెంపొందించడమే లక్ష్యంగా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకు ఏఐ పోస్టర్ ప్రెజెంటేషన్, ఏఐ స్లయిడ్ క్రాఫ్ట్, ఏఐ వీడియో విజన్, ఏఐ ప్రొఫైల్ క్రాఫ్ట్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు.

కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రో-ఛాన్సలర్ డా. ఎం. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థులు ఏఐ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడం ఎంతో అవసరమన్నారు.విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డా. మాగంటి వెంకటేష్ ఆరోగ్య రంగంలో ఏఐ టెక్నాలజీ వినియోగం, వివిధ ఏఐ సాధనాల ఉపయోగంపై విద్యార్థులకు ప్రాక్టికల్ శిక్షణ అందించారు.స్కూల్ ఆఫ్ ఫార్మసీ డీన్ డా. షేక్ అబ్దుల్ రెహమాన్ మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో దేశంలోని 16 విశ్వవిద్యాలయాలు, 20 అనుబంధ కళాశాలలకు చెందిన 450 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. విద్యార్థుల్లో ఏఐ నైపుణ్యాలను పెంపొందించేందుకు 'ఏఐ స్పైర్--2026' మంచి వేదికగా నిలిచిందన్నారు.పోటీల్లో ప్రతిభ కనబరిచి విజయం సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు, ప్రశంసాపత్రాలను అందజేశారు.కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ డా. జి. సురేష్, ప్రో వైస్ ఛాన్సలర్లు డా. రమేష్, డా. టి. రవి తంగజం, ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ డా. కె. రవిశంకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆదిత్య యూనివర్సిటీలో క్షేత్ర పర్యటన -- ఆలోచనల సృష్టి



**, గండేపల్లి ,పెన్ పవర్, అక్టోబర్ 01:** గండేపల్లి మండలం సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీలో స్కూల్ ఇన్నోవేషన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో డైస్ ఇనిషియేటివ్‌లో భాగంగా "క్షేత్ర పర్యటన మరియు ఆలోచనల సృష్టి" కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ, పాఠశాల విద్య--అక్షరాస్యత విభాగం, పీఎం శ్రీ, ఏఐసీటీఈ, ఇన్నోవేషన్ సెల్, స్కూల్ ఇన్నోవేషన్ కౌన్సిల్, డైస్ సహకారంతో ఈ కార్యక్రమం జరిగింది.పెద్దాపురం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు పాల్గొని యూనివర్సిటీలోని ఇంక్యుబేషన్ సెంటర్, ఐడియా ల్యాబ్, మెకానికల్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ ల్యాబ్‌లను సందర్శించారు. ఆదిత్య యూనివర్సిటీ విద్యార్థులు రూపొందించిన వివిధ నూతన ఆవిష్కరణ ప్రాజెక్టులను పరిశీలించారు.వివిధ సమస్యలకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అనుసంధానించి పరిష్కారాలు రూపొందించే విధానం, నూతన ఆవిష్కరణలపై ఈ పర్యటన ద్వారా అవగాహన కలిగిందని విద్యార్థినులు తెలిపారు.పాఠశాల విద్యార్థుల్లో సృజనాత్మకత, సమస్య పరిష్కార నైపుణ్యాలు, ఆవిష్కరణ స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు వారిని భవిష్యత్తులో ఆవిష్కరణలు, వ్యవస్థాపకత వైపు ప్రోత్సహించడమే కార్యక్రమం లక్ష్యమని యూనివర్సిటీ అధికారులు తెలిపారు.

కార్యక్రమంలో ప్రో వైస్ ఛాన్సలర్ డా. ఏ. రమేష్, రిజిస్ట్రార్ డా. జి. సురేష్, డీన్లు డా. సత్యనారాయణ, డా. జి. సంజీవ్ రావు, కోఆర్డినేటర్లు టి. చరణ్ సంజీవ్, ఏ. కళ్యాణ్ చక్రవర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రక్తదానం చేద్దాం... ప్రాణదాతలుగా నిలుద్దాం

ఆదిత్య డిగ్రీ కళాశాలలో ప్రపంచ స్వచ్ఛంద రక్తదాతల దినోత్సవం.. రక్తదాతలకు అభినందనలు




**కాకినాడ, పెన్ పవర్ అక్టోబర్ 1 :**ప్రపంచ స్వచ్ఛంద రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో రక్తదాతలను ఘనంగా అభినందించారు. రక్తదానం ద్వారా ఎంతోమంది ప్రాణాలను కాపాడేందుకు తమ వంతు సహకారం అందిస్తున్న విద్యార్థులను ఈ సందర్భంగా అభినందించారు.కార్యక్రమంలో ఆదిత్య డిగ్రీ కళాశాల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఈ.వి.ఎల్. నాయుడు మాట్లాడుతూ రక్తదానం గొప్ప మానవతా సేవ అని అన్నారు. ఆరోగ్యవంతమైన ప్రతి ఒక్కరూ రక్తదానంపై అవగాహన పెంచుకుని స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులు రక్తదాన కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ సామాజిక బాధ్యతను చాటుతున్నారని అభినందించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందుబాటులో ఉండటం ద్వారా ఎంతోమంది ప్రాణాలను కాపాడవచ్చున్నారు. యువత రక్తదానంపై అవగాహన పెంచుకుని సమాజ సేవలో చురుగ్గా పాల్గొనాలని సూచించారు.ఈ సందర్భంగా ఆరుసార్లు రక్తదానం చేసిన విద్యార్థులు పి.చరణ్ తేజ,కె. సురేష్,టి.మణికంఠ,పి.సాయి చైతన్య,ఎ.శివరామ్లను ప్రత్యేకంగా అభినందించి పతకాలు అందజేశారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ఎన్ఎస్ఎస్ బృందాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణారెడ్డి అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు టి.తేజేశ్వరరావు, డి. అశ్విని ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ భరోసా సంక్షేమ పాలనకు ప్రతీక



**రామచంద్రపురం, పెన్ పవర్ అక్టోబర్ 1 :**కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు ప్రజల జీవితాల్లో భరోసా నింపుతున్నాయని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. గురువారం రామచంద్రపురం రూరల్ మండలం వెలంపాలెం, ద్రాక్షారామం గ్రామాల్లో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొని లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పెన్షన్లు అందజేశారు.ఈ సందర్భంగా వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, ఇతర లబ్ధిదారులను మంత్రి ఆప్యాయంగా పలకరించి వారి ఆరోగ్య పరిస్థితులు, కుటుంబ అవసరాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి అర్హ కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.ఒకటో తేదీ తెల్లవారుజాము నుంచే లబ్ధిదారుల గడప వద్దకు వెళ్లి పెన్షన్లు అందించడం కూటమి ప్రభుత్వ సంక్షేమ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. ఆర్థిక పరిస్థితులు సవాలుగా ఉన్నప్పటికీ ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలులో ఎలాంటి రాజీ లేకుండా ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు సమర్థవంతంగా అమలవుతున్నాయని మంత్రి సుభాష్ తెలిపారు. రామచంద్రపురం నియోజకవర్గంలో ప్రతి అర్హుడికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా నిరంతరం కృషి చేస్తున్నామని అన్నారు. ప్రజల ముఖాల్లో చిరునవ్వు చూడటమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, అభివృద్ధి, సంక్షేమాన్ని సమపాళ్లలో అందిస్తూ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొత్తపల్లి అరుణ రామారావు, సంపత్ సత్యనారాయణ, పెంకే సాంబశివరావు, రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ పెంకే అన్నపూర్ణ, శీలం వీరభద్రరావు, కాలకురస ఏడుకొండలు,రవ్వా భూషణం, దవులూరి రామకృష్ణ, సలాది శ్రీను,గణేష్,టేకుమూడి సత్యనారాయణ,ఆళ్ల బుజ్జి,కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

56 కొత్త స్పౌజ్ పింఛన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే బండారు



**కొత్తపేట, పెన్ పవర్, అక్టోబర్ 1:** పేదల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. గురువారం కొత్తపేట బొరుసువారి సావరంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆర్డీఓ సత్యనారాయణ, మార్కెట్‌యార్డు చైర్మన్ పల్లి మంగాదేవి భీమారావుతో కలిసి ఆయన లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కొత్తపేట నియోజకవర్గంలో 41,248 మందికి నెలకు రూ.18.11 కోట్ల పింఛన్లు అందిస్తున్నట్లు తెలిపారు. కొత్తగా మంజూరైన 56 స్పౌజ్ పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. దివ్యాంగుల పింఛన్‌ను రూ.3 వేల నుంచి రూ.6 వేలకు పెంచినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రతి నెలా ఒకటో తేదీన పింఛన్లు అందిస్తున్నామని తెలిపారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో రైతులు, మహిళలు, విద్యార్థులకు వివిధ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ లబ్ధిదారులతో ముఖాముఖి నిర్వహించి పథకాల అమలుపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. మహిళలకు స్త్రీశక్తి పథకం ద్వారా కలుగుతున్న ప్రయోజనాలను అడిగి తెలుసుకున్నారు.

# భద్రవరం లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో...





**ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల గ్రామ సేవా కార్యక్రమాలు.**

**ఏలేశ్వరం, పెన్ పవర్, అక్టోబర్ 1:** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు జాతీయ సేవా పథకం లో భాగంగా భద్రవరం గ్రామంలో ప్రత్యేక గ్రామ సేవ కార్యక్రమం నిర్వహించారు. కళాశాల విద్యార్థుల్లో సామాజిక బాధ్యతను పెంపొందించడంతో పాటు గ్రామీణ ప్రజలకు పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రత మరియు స్థిరమైన వ్యవసాయ విధానాలపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని, గ్రామ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, చెట్లను సంరక్షించడం, జీవవైవిధ్యాన్ని కాపాడటం మరియు సేంద్రియ వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడం ద్వారా పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ తమ వంతు పాత్ర పోషించాలని కళాశాల ప్రిన్సిపాల్ డా. డి సునీత సూచించారు. కార్యక్రమంలో భాగంగా ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్లు భద్రవరం గ్రామంలోని పలు ప్రాంతాలను సందర్శించి పరిశుభ్రత కార్యక్రమాన్ని చేపట్టారు. రహదారులు, పరిసర ప్రాంతాలు, ప్రజలు ఎక్కువగా సంచరించే ప్రదేశాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించి గ్రామ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేశారు. పరిశుభ్రమైన పరిసరాలు ఆరోగ్యకరమైన జీవనానికి ఎంతో అవసరమని ప్రజలకు వివరించారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా, తడి, పొడి చెత్తను వేరు చేసి సరైన విధంగా నిర్వహించాలని కళాశాల విద్యార్థిని విద్యార్థులు ప్రజలకు సూచించారు.

**అవగాహన ర్యాలీ**

ఈ కార్యక్రమంలో భాగంగా వాలంటీర్లు గ్రామంలో ప్లాస్టిక్ వినియోగం తగ్గింపు , ప్లాస్టిక్ వల్ల కలిగే పర్యావరణ నష్టాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ సంచులు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని తగ్గించి, వాటి స్థానంలో పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను ఉపయోగించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే జీవవైవిధ్య పరిరక్షణ ప్రాముఖ్యతపై కూడా గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. మొక్కలు, పక్షులు, జంతువులు, కీటకాలు మరియు ఇతర జీవరాశులు ప్రకృతి సమతుల్యతలో కీలక పాత్ర పోషిస్తాయని విద్యార్థులు ప్రజలకు వివరించారు. స్థానిక మొక్కలను సంరక్షించడం, చెట్లను పెంచడం, పక్షులు మరియు ఇతర జీవులకు అనుకూలమైన వాతావరణాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు.గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయానికి ఉపయోగపడే ఫార్మ్యార్డ్ మాన్యూర్ (పశువుల ఎరువు) వినియోగంపై కూడా ప్రజలకు అవగాహన కల్పించారు. పశువుల ఎరువు వంటి సేంద్రియ పదార్థాలను వ్యవసాయంలో ఉపయోగించడం ద్వారా నేల సారాన్ని మెరుగుపరచవచ్చని, సేంద్రియ వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు తోడ్పడవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో 80 మంది వాలంటీర్లు అధ్యాపకులు పాల్గొన్నారు. విద్యార్థులు గ్రామంలోని ప్రజలతో నేరుగా మాట్లాడి పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రత మరియు ఆరోగ్యకరమైన జీవన విధానాలపై అవగాహన కల్పించారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అధ్యాపకుల ఆధ్వర్యంలో విద్యార్థులు నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను స్వయంగా పరిశీలించి అభినందించారు.ఈ కార్యక్రమంలో జాతీయ సేవ పథకం ప్రోగ్రాం ఆఫీసర్ డా. ప్రయాగ మూర్తి ప్రగడ, కూటమి నేత జిగటాపు సూరిబాబు, ప్రాథమిక పాటశాల ప్రదానోపాద్యాయులు రాజు అధ్యాపకులు డా మదీనా, డా. శివ ప్రసాద్, డా. బంగార్రాజు , సతీశ్ , ఏసు , ధర్మ రాజు వాలంటీర్లు పాల్గొన్నారు.




### లింగవరం కాలనీలో దేవీ శరన్నవరాత్రులకు

# పందిరి రాట మహోత్సవం.





**ఏలేశ్వరం, పెన్ పవర్, అక్టోబర్ 1:** స్థానిక లింగవరం కాలనీలో నిర్వహించనున్న దేవి శరన్నవరాత్రి ఉత్సవాలకు నిర్వాహకులు గురువారం పందిరి ఆట మహోత్సవాన్ని నిర్వహించారు. మూడవ వార్డు మాజీ కౌన్సిలర్ జువ్విన వీర్రాజు, వీర రాఘవమ్మ దంపతులు ప్రతి ఏటా శరన్నవరాత్రులు ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ముద్రగడ గిరిబాబు హాజరయ్యారు.వేద మంత్రోచ్ఛారణల నడుమ శాస్త్రోక్తంగా పందిరి రాట వేసే కార్యక్రమం నిర్వహించారు.అమ్మవారి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలి అని ఆకాంక్షించి నట్లు గిరిబాబు తెలిపారు.ఈ కార్య క్రమంలో వైసిపి నాయకులు శిడగం వెంకటేశ్వర రావు ,బదిరెడ్డి గోవింద్, దత్తి రాజా, రాచర్ల రమేష్, కృష్ణార్జునుడు, భక్తులు పాల్గొన్నారు.

# బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల కోసం సుప్రీంకోర్టుకు వెళ్తాం-మంత్రి సుభాష్



**రామచంద్రపురం, అక్టోబర్ 1 ,పెన్ పవర్:**స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తగ్గబోదని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోలను ఏపీ హైకోర్టు కొట్టివేసిన నేపథ్యంలో, గురువారం రామచంద్రపురంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు.హైకోర్టు తీర్పును గౌరవిస్తూనే బీసీలకు న్యాయం జరిగేలా రాష్ట్ర ప్రభుత్వం తరఫున సుప్రీంకోర్టును ఆశ్రయించనున్నట్లు మంత్రి తెలిపారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలన్న నిర్ణయానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి పేర్కొన్నారు. 34 శాతం రిజర్వేషన్లపై ప్రభుత్వం సమర్పించిన వివరణలో యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే ద్వారా సేకరించిన బీసీ జనాభా వివరాలను ప్రాతిపదికగా తీసుకున్నట్లు హైకోర్టుకు తెలిపింది.బీసీలకు దక్కాల్సిన రాజకీయ ప్రాతినిధ్యాన్ని కాపాడేందుకు న్యాయపరంగా పోరాటం కొనసాగిస్తామని మంత్రి సుభాష్ స్పష్టం చేశారు.

## బలహీన వర్గాల ఆశాజ్యోతి జీఎంసీ బాలయోగి



**రామచంద్రపురం రూరల్, అక్టోబర్ 1 ,పెన్ పవర్:**బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, కోనసీమ ముద్దుబిడ్డ, లోక్‌సభ మాజీ స్పీకర్ స్వర్గీయ జీఎంసీ బాలయోగి అని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. బాలయోగి 75వ జయంతి సందర్భంగా వెలంపాలెంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ సామాన్య దళిత రైతు కుటుంబంలో జన్మించిన బాలయోగి తన నిష్పక్షపాత వైఖరి, హుందాతనంతో దేశ అత్యున్నత రాజ్యాంగ పదవుల్లో ఒకటైన లోక్‌సభ స్పీకర్ పదవిని అధిరోహించారన్నారు.సభాపతిగా క్లిష్ట పరిస్థితుల్లోనూ సభను సమర్థవంతంగా నడిపి పార్లమెంటరీ సంప్రదాయాలను బలోపేతం చేశారని తెలిపారు. వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి,విద్యా, సామాజిక వికాసానికి బాలయోగి చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా, కోనసీమ అభివృద్ధితో పాటు రైల్వే లైన్ల మంజూరు, రవాణా సౌకర్యాల మెరుగుదలకు ఆయన చేసిన సేవలు చరిత్రలో నిలిచిపోతాయని పేర్కొన్నారు. అతి పిన్న వయస్సులోనే లోక్‌సభ స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టి జాతీయ రాజకీయాల్లో తెలుగువారి కీర్తిని చాటిన మహోన్నత వ్యక్తి బాలయోగి అని కొనియాడారు.బాలయోగి మన మధ్య లేకపోయినా ఆయన ఆశయాలు, రాజకీయ విలువలు నేటి తరానికి ఆదర్శప్రాయమని మంత్రి సుభాష్ పేర్కొన్నారు.కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, కూటమి పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక వైభవానికి ప్రతీకగా వాడపల్లి క్షేత్రం

**వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న ఎండోమెంట్స్ ట్రిబ్యునల్ చైర్మన్ ఏ. భారతి**




**ఆత్రేయపురం పెన్ పవర్ అక్టోబర్ 1:** కోనసీమ తిరుమలగా భక్తజన హృదయాల్లో విశిష్ట స్థానం సంపాదించుకున్న వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామివారి సన్నిధికి ఆంధ్రప్రదేశ్ ఎండోమెంట్స్ ట్రిబ్యునల్, పెదకాకాని, విజయవాడ చైర్మన్ ఏ. భారతి విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆమెకు ఆలయ అధికారులు , ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు.అనంతరం స్వామివారి మూలవిరాట్టును దర్శించుకున్న ఏ. భారతి ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య స్వామివారికి నిర్వహించిన ప్రత్యేక సేవల్లో ఆమె పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా వాడపల్లి క్షేత్ర ఆధ్యాత్మిక విశిష్టత, ఆలయంలో కొనసాగుతున్న పూజా కార్యక్రమాలు, భక్తులకు అందుతున్న సేవలపై ఆలయ అధికారులు వివరించారు.ప్రత్యేక పూజల అనంతరం ఆలయ అధికారి వై. శ్రీనివాస్ వెంకటరాజు స్వామివారి చిత్రపటాన్ని ఏ. భారతికి అందజేశారు. పవిత్ర గౌతమీ గోదావరి తీరాన కొలువుదీరిన వాడపల్లి వెంకటేశ్వర స్వామివారి క్షేత్రానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటున్న నేపథ్యంలో, ఆలయ ఆధ్యాత్మిక ప్రాశస్త్యం మరింత విస్తరిస్తోందని ఆలయ వర్గాలు పేర్కొన్నాయి.



# టిటిడిలో “సలాది” కి అరుదైన గౌరవం




**వాడపల్లి ట్రస్ట్ బోర్డు డైరెక్టర్ హోదాలో ప్రత్యేక దర్శనం**

**ఆలమూరు, పెన్ పవర్ అక్టోబర్ 01:**ప్రముఖుల సిఫార్సు లేఖలతో తిరుమలేశుని దర్శనం చేసుకోవడం అందరికీ తెలిసిందే.
ఎమ్మెల్యే,ఎంపీ,మంత్రులు,టిటిడి డైరెక్టర్లు, ఐఏఎస్ అధికారులు తదితర ప్రముఖులకు ఇలా సిఫార్సు లేఖలు ఇచ్చే అవకాశం ఉంటుంది. అయితే కోనసీమ తిరుమల గా ప్రసిద్ధి చెందిన వాడపల్లి వెంకటేశ్వర స్వామి దేవస్థానం డైరెక్టర్,ఆలమూరు మండల టిడిపి ప్రధాన కార్యదర్శి సలాది నాగేశ్వరరావు తన బోర్డ్ డైరెక్టర్ పదవితో టీటీడీ ప్రత్యేక దర్శన అవకాశం కల్పించడం విశేషం.ఆయన కుటుంబ సభ్యులతో కలిసి బోర్డ్ డైరెక్టర్ హోదాతో టిటిడి కి దరఖాస్తు చేసుకున్నారు. రూ 300 స్పెషల్ ఎంట్రీ దర్శనం టిక్కెట్లు సలాది పేరుతోనే కల్పించడం ఆయనకు దక్కిన గౌరవంగా పేర్కొవచ్చు. అంతేకాదు వాడపల్లి దేవస్థానం విశిష్టత కూడా ఈ సందర్భంగా తేటతెల్లమవుతుంది. శ్రీవారి దర్శనం అనంతరం సలాది ఈ ఆనందాన్ని స్థానిక విలేకరులతో పంచుకున్నారు.

## మెగా జాబ్ మేళాలో 245 మంది యువతకు ఉద్యోగాలు





**రామచంద్రపురం, పెన్ పవర్ అక్టోబర్ 1:** రామచంద్రపురం నియోజకవర్గంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రత్యేక చొరవతో నిర్వహించిన మెగా జాబ్ మేళాలో 245 మంది యువత ఉద్యోగాలకు ఎంపికయ్యారు. సత్యం వాసంశెట్టి ఫౌండేషన్, వికాస ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. లచ్చారావు సమన్వయంతో రామచంద్రపురంలోని వీఎస్ఎం కళాశాలలో నిర్వహించిన ఈ జాబ్ మేళాకు 25 ప్రముఖ మల్టీనేషనల్ కంపెనీల ప్రతినిధులు హాజరై అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఇప్పటివరకు నియోజకవర్గంలో 52 జాబ్ మేళాలు నిర్వహించామని తెలిపారు. వీటి ద్వారా వేలాది మంది నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లభించాయని పేర్కొన్నారు.భవిష్యత్ ఉద్యోగ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఐటీ రంగంలో ఉపాధి కోరుకునే నిరుద్యోగులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), సైబర్ సెక్యూరిటీ, డేటా అనలిటిక్స్ తదితర ఆధునిక కోర్సుల్లో ఉచిత శిక్షణ అందించనున్నట్లు మంత్రి తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు మంత్రి క్యాంపు కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. శిక్షణ పూర్తి చేసిన వారికి ఇన్ఫోసిస్ ఆధ్వర్యంలో సర్టిఫికెట్లు అందజేస్తామని, ఆయా కోర్సుల ద్వారా రూ.4 లక్షల నుంచి రూ.7 లక్షల వరకు వార్షిక వేతన ప్యాకేజీలతో ఉద్యోగ అవకాశాలు పొందే అవకాశం ఉంటుందని తెలిపారు.
సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ నియోజకవర్గంలో నిరుద్యోగ సమస్య పూర్తిగా పరిష్కారమయ్యే వరకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాబ్ మేళాలను నిరంతర ప్రక్రియగా కొనసాగిస్తామని తెలిపారు. మెగా జాబ్ మేళాలో ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేశారు.నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రముఖ కంపెనీలను జాబ్ మేళాలకు తీసుకువస్తున్న వికాస ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. లచ్చారావు సేవలను వాసంశెట్టి సత్యం అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని సంస్థలను భాగస్వామ్యం చేసి యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు కల్పిస్తామని లచ్చారావు తెలిపారు.కార్యక్రమంలో వీఎస్ఎం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలాజీ, వైస్ ప్రిన్సిపాల్ వి. రవీంద్ర, వికాస మేనేజర్లు శర్మ, శ్రీకాంత్, పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఉండవల్లి శివ, ఉపాధ్యక్షుడు చందమామ వాసు, ఎస్‌కేపీపీ ట్రస్ట్ చైర్మన్ సలాది నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

# కోలంకలో ఆర్ఎస్ఎస్ శాఖ సప్తాహం

**కాజులూరు, పెన్ పవర్ అక్టోబర్ 1 :**ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా కోలంక గ్రామంలో శాఖ సప్తాహం కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం స్థానిక శివాలయం వద్ద ఉదయం 6 నుంచి 7 గంటల వరకు యోగా,సూర్య నమస్కారాలు, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఆర్ఎస్ఎస్ జిల్లా కార్యవర్గ సభ్యులు రామారావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో స్వయంసేవకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.యోగా,సూర్య నమస్కారాల ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు క్రమశిక్షణ, సేవాభావం వంటి విలువలను పెంపొందించుకోవాలని నిర్వాహకులు సూచించారు.గత నెల 27 నుంచి గ్రామాల్లో శాఖ సప్తాహం కార్యక్రమాలు కొనసాగుతున్నాయని రామారావు తెలిపారు.కార్యక్రమంలో డీఎల్పీ రాజు, వరద వెంకట నాగేశ్వరరావు, దంతులూరి వంశీ,కంబాల చిన్న, మేడిశెట్టి మణికంఠ, కూనపరెడ్డి చిన్న, కొత్తలంక మార్కండేయ



## రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికైన జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాల ముక్కామల విద్యార్థి



**అంబాజీపేట, పెన్ పవర్, అక్టోబరు 1:**గత నెల 30న కాకినాడ డిఎస్ ఏ గ్రౌండ్స్ 9 స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో జరిగిన జిల్లా 'అండర్ 19' 75 కేజీల విభాగంలో పదవ తరగతి చదువుచున్న గుండ్రు దినేష్ ప్రసాద్ మొదటి స్థానాన్ని సాధించాడు. . విద్యార్థి త్వరలో జరగబోవు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికవడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేసి అభినందనలు తెలియ జేసారు. పాఠశాలలో గురువారం జరిగిన సమావేశంలో విద్యార్థి గుంట్రు దినేష్ ప్రసాద్ కు మార్గదర్శిగా వ్యవహరించిన పాఠశాల పి.డి ముత్యాల పవన్ కిషోర్ను ప్రధానోపాధ్యాయులు ఎం. శ్రీహరి ప్రసాద్, పాఠశాల ఉపాధ్యా యులు కె. నాగేశ్వరరావు, జి.వి.వి. సత్యనారాయణ, పాఠశాల ఎస్ ఎం.సి. చైర్మన్ కె. విజయ కృష్ణ , మాజీ సర్పంచ్ బండారు వెంకట లక్ష్మి , మాజీ జడ్పీటిసి బూడిన వరలక్ష్మి, మాజీ ఎం.పి.టి.సి. వి. దుర్గ, దువ్వూరి సురేష్, వక్కపట్ల సుబ్రహ్మణ్యం, ముషిణి మాణిక్యం, మానేపల్లి శ్రీను తదితరులు అభినందనలు తెలిపారు.

## ఎరికిరెడ్డి నాగమణి కుటుంబ సభ్యులకు మాజీ ఎమ్మెల్యే పర్వత పరామర్శ.




**కిర్లంపూడి, పెన్ పవర్, అక్టోబర్, 01:**కిర్లంపూడి మండలం వేలంక గ్రామంలో ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన ఎరికిరెడ్డి నాగమణి కుటుంబ సభ్యులను, వారి అల్లుడు జర్నలిస్ట్ సుబ్బు తుమ్మల సుబ్బు ను పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, జర్నలిస్టులు పరామర్శించి తమ సానుభూతిని తెలిపారు. ముందుగా నాగమణి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. ప్రత్తిపాడు మాజీ ఎమ్మెల్యే పర్వత శ్రీ పూర్ణ చంద్రప్రసాద్, కిర్లంపూడి సొసైటీ మాజీ చైర్మన్, జనసేన పార్టీ నాయకులు చదలవాడ బాబి,కిర్లంపూడి తాజా మాజీ ఎంపీపీ తోట రవి, జగ్గంపేట నియోజకవర్గ అభివృద్ధి కమిటీ సభ్యులు భూపాలపట్నం ప్రసాద్, చదరం చంటిబాబు, జగ్గంపేట ఏఎంసీ డైరెక్టర్ బొదిరెడ్ల సుబ్బారావు, కిర్లంపూడి మండల తెలుగు యువత అధ్యక్షులు గండే కాశీ విశ్వనాథ్, చిల్లంగి యువ నాయకులు కాళ్ళ వెంకటేష్, నాయకులు దాసరి రమేష్, అడబాల శ్రీను, ఉమ్మిత వెంకటరమణ, యల్లపు శివ, ప్రైమ్ 9 టీవీ రిపోర్టర్ ప్రతి శ్రీనివాసరావు (వాసు), ఆర్ టీవీ రిపోర్టర్ బూతుకూరి బాలకృష్ణ (బాలు)తో పాటు పలువురు జర్నలిస్టులు, పలువురు నాయకులు, ఎరికిరెడ్డి కుటుంబం సభ్యులు నాగమణి చిత్రపటానికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## వృద్ధుల పట్ల ప్రేమ చూపించాలి.



**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్,అక్టోబర్, 01:** వృద్ధుల పట్ల ప్రేమతత్వం కనబరచాలని ప్రత్తిపాడు సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ శారదామణి అన్నారు.గురువారం సీనియర్ సిటిజన్స్ డే సందర్భంగా ప్రత్తిపాడు జాతీయ రహదారి వద్ద ఉన్న శారద వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు,స్వీట్స్ పంచిపెట్టే కార్యక్రమం నిర్వహించారు.వృద్ధులకు ఉన్న చట్టాల గురించి తెలియపరిచారు.ఈ కార్యక్రమంలో సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ శారదమణితోపాటు పానెల్ అడ్వకేట్స్ బుగతా శివన్నారాయణ,పిల్లి బలరాముడు తదితరులు పాల్గొన్నారు

## మండల కాంగ్రెస్ పార్టీ కమిటి నియామకం



**అంబాజీపేట, పెన్ పవర్, అక్టోబరు 1:** మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయము నందు నూతనముగా జిల్లా కార్యవర్గంలో ఉపాధ్యక్షులుగా మహమ్మద్ ఇస్మాయిల్ షరీఫ్, ప్రధాన కార్యదర్శిగా నెల్లి వెంకటరమణ, మండల అధ్యక్షులుగా దొమ్మేటి వినోద్ కుమార్ లకు పదోన్నతి కల్పిస్తూ నియామక పత్రములు వచ్చిన సందర్భంగా, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సభ్యులు ములపర్తి మోహన రావు అధ్యక్షతన గురువారం చిరు సత్కారం చేసారు. ఈ సందర్భంగా మహమ్మద్ ఇస్మాయిల్ షరీఫ్, నెల్లి వెంకటరమణ, దొమ్మేటి వినోద్ కుమార్, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి, సిడబ్ల్యూసి సభ్యులు గిడుగు రుద్రరాజు, ఏఐసిసి సభ్యులు జంగా గౌతమ్, డిసిసి అధ్యక్షులు కొత్తూరి శ్రీనివాస్ లకు ధన్యవాదములు తెలియజేసినారు. వారికి జిల్లా కార్యవర్గంలో మండల అధ్యక్షుడిగా స్థానం కల్పించినందుకు కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీని తిరిగి పునర్నిర్మాణం గావిస్తామని తెలియజేసినారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సభ్యులు మాచవరపు శివన్నారాయణ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఆదుర్తి నారాయణమూర్తి, మహమ్మద్ హబీబ్, మహిళా నాయకురాలు కొల్లి సరోజిని పాల్గొని వీరికి అభినందనలు తెలియజేసినారు.

## రఘుపతి వెంకటరత్నం నాయుడు జీవితం నేటి తరానికి ఆదర్శం



**ఆలమూరు జూనియర్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో వక్తలు**

**ఆలమూరు, పెన్ పవర్, అక్టోబర్ 01:**సమాజ సంస్కర్త, మానవతావాది, మహిళా విద్య, అణగారిన వర్గాల అభ్యున్నతి, దేవదాసి వ్యవస్థ నిర్మూలన వంటి అనేక సామాజిక సంస్కరణల కోసం జీవితాంతం కృషి చేసిన రఘుపతి వెంకట రత్నం నాయుడు జీవితం నేటి తరానికి ఆదర్శమని బాలమందిరం ప్రధాన కార్యదర్శి కృష్ణశ్రీ, ఆలమూరు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నల్లమిల్లి సురేష్ రెడ్డి అన్నారు.గురువారం రఘుపతి వెంకటరత్నం నాయుడు జయంతి సందర్భంగా ఆలమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ నల్లమిల్లి సురేష్ రెడ్డి అధ్యక్షతన వెంకట రత్నం నాయుడు జయంతి సభ నిర్వహించారు. సభలో ముఖ్య అతిథులుగా బాలమందిరం ప్రధాన కార్యదర్శి కృష్ణశ్రీ, తెలుగు అధ్యాపకులు జి. శ్రీనివాస్ పాల్గొని వెంకటరత్నం నాయుడు జీవితవిశేషాలు,సంఘసంస్కర్తగా,విద్యావేత్తగా,బ్రహ్మ సమాజ ఉద్యమ నాయకుడుగా ఆయన చేసిన సేవల గురించి విద్యార్థులకు తెలియజేశారు. ప్రిన్సిపాల్ నల్లమిల్లి సురేష్ రెడ్డి, కృష్ణ శ్రీ వెంకటరత్నం నాయుడు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.కార్యక్రమంలో భాగంగా ఇంటర్ విద్యార్థిని భవ్య చేసిన ప్రసంగం అందర్నీ అలరించింది.

## ఈనెల 11 నుండి వాసవి అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలు



**అంబాజీపేట, పెన్ పవర్, అక్టోబరు 1:**అంబాజీపేటలో వేంచేసియున్న శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు ఈనెల11వ తేదీ నుండి 20వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేశామని శ్రీ వాసవి వైశ్య సంఘం అధ్యక్షులు గ్రంధి సాయిబాబు, కార్యదర్శి కడించర్ల అర్జునుడు తెలిపారు. గురువారం స్థానిక వాసవి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో సాయిబాబు అధ్యక్షతన ఉత్సవ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వైశ్య సంఘ నాయకులు మాట్లాడుతూ 11వ తేదీ ఆదివారం శ్రీ చక్రార్చన, అలంకారములతో కలశస్థాపన జరుగుతుందన్నారు. 12వ తేదీ సోమవారం శ్రీ గాయత్రి దేవిగా, 13వ తేదీ శ్రీ అన్నపూర్ణాదేవిగా, 14వ తేదీ శ్రీ లలితా దేవిగా, 15వ తేదీ శ్రీ బాల త్రిపుర సుందరి దేవిగా, 16వ తేదీ శ్రీ రాజరాజేశ్వరీ దేవిగా, 17వ తేదీ శ్రీ మహాలక్ష్మి దేవిగా, 18వ తేదీ శ్రీ సరస్వతి దేవిగా, 19వ తేదీ శ్రీ మహిషాసుర మర్దిని అమ్మవారుగా, 20వ తేదీ శ్రీ విజయ దుర్గా దేవి గా వాసవి మాత భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు. 23వ తేదీ శుక్రవారం అమ్మవారి ఊరేగింపు మహోత్సవం అత్యంత వైభవంగా జరుగుతుందని తెలిపారు .ఈ సమావేశంలో కోశాధికారి అప్పన వీర వెంకట నాగేశ్వరరావు (దత్తుడు), కన్వీనర్ అప్పన శ్యామ్ ఉత్సవ కమిటీ చైర్మన్ గెల్లి సంతోష్, కాజా వీర్రాజు, అప్పన్న బాలాజీ, కాసు నాగేంద్ర, కాసు ఫణీంద్ర, అప్పన వాసు, అప్పన బాలాజీ, నిట్టాల సాయి ప్రసాద్, అప్పన మణికంఠ, గ్రంధి శ్రీను, పాబోకు శ్రీ ను, గాదె సతీష్, వెత్సాగుప్త, తదితరులు పాల్గొన్నారు.

## రావులపాలెం పంచాయతీకి స్వచ్ఛాంధ్ర--స్వర్ణాంధ్ర అవార్డు



**రావులపాలెం పెన్ పవర్ అక్టోబర్ 1:**పారిశుధ్య నిర్వహణలో ఉత్తమ ప్రమాణాలు పాటిస్తున్న కోనసీమ ముఖద్వారం రావులపాలెం గ్రామపంచాయతీకి ప్రతిష్ఠాత్మక స్వచ్ఛాంధ్ర--స్వర్ణాంధ్ర అవార్డు లభించింది. గాంధీ జయంతి సందర్భంగా శుక్రవారం అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా పంచాయతీ అభివృద్ధి అధికారి ఎల్. దుర్గాప్రసాద్ అవార్డును అందుకోనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎంపికైన 12 పంచాయతీల్లో రావులపాలెంకు స్థానం దక్కగా, ఉమ్మడి గోదావరి జిల్లాల పరిధిలో కేవలం రెండు పంచాయతీలే ఎంపికయ్యాయి.ఇంటింటికీ చెత్త సేకరణ, తడిచెత్త--పొడిచెత్త వేరు చేయడం, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం నిర్వహణ, వార్డులను విభజించి సమర్థవంతమైన పారిశుధ్య నిర్వహణ, ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని అవార్డుకు ఎంపిక చేశారు. ఇప్పటికే రాష్ట్రంలో తొలి ఐఎస్ఓ సర్టిఫికెట్‌ను సొంతం చేసుకున్న రావులపాలెం పంచాయతీకి ఈ పురస్కారం మరో గుర్తింపుగా నిలిచింది.

## కోనసీమ అభివృద్ధి ప్రధాత జీఎంసీ బాలయోగి జయంతి



**అంబాజీపేట ,పెన్ పవర్, అక్టోబర్ 1:**కోనసీమ అభివృద్ధి ప్రధాత మహానేత లోక్‌సభ మాజీ స్పీకర్ స్వర్గీయ జీఎంసీ బాలయోగి అని పలువురు నాయకులు అన్నారు. బాలయోగి 75వ జయంతి సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయం లో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశ అత్యున్నత రాజ్యాంగ పదవుల్లో ఒకటైన లోక్‌సభ స్పీకర్ పదవిని అధిరోహించారన్నారని సభాపతిగా క్లిష్ట పరిస్థితుల్లోనూ సభను సమర్థవంతంగా నడిపి పార్లమెంటరీ సంప్రదాయాలను బలోపేతం చేశారని అన్నారు. కోనసీమ ను అభివృద్ధి చేయాలనే తలంపుతో ఆలోచించేవారని వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి,విద్యా, సామాజిక వికాసానికి బాలయోగి చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. కోనసీమ అభివృద్ధితో పాటు రైల్వే లైన్ల మంజూరు, రవాణా సౌకర్యాల మెరుగుదలకు ఆయన చేసిన సేవలు చరిత్రలో నిలిచిపోతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర డైరెక్టర్ మట్టపర్తి బాల భారతి కూటమి పార్టీల నాయకులు దొమ్మేటి రామారావు, కొర్లపాటి గోపి, దొమ్మేటి సాయికృష్ణ, బిజెపి పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కురస ఆంజనేయులు, కొప్పినీడి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు విశ్వవిద్యాలయంలో వివిధ కోర్సులకు ప్రవేశాలు

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబరు 1:** పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం రాజమహేంద్రవరం, శ్రీశైలం, కూచిపూడి ప్రాంగణాల్లో 2026--27 విద్యా సంవత్సరానికి కోర్సుల్లో ప్రవేశాలు నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ మునుగు శ్రీనివాసరావు తెలిపారు. రాజమహేంద్రవరం సాహిత్య పీఠంలో ఎం.ఏ. తెలుగు, జ్యోతిష్యంలో సర్టిఫికెట్, డిప్లొమా, యోగా డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సులు; శ్రీశైలం చరిత్ర, సంస్కృతి--పురావస్తు శాస్త్ర పీఠంలో ఎం.ఏ. చరిత్ర--పురావస్తు శాస్త్రం; కూచిపూడి శ్రీ సిద్ధేంద్రయోగి కూచిపూడి కళాపీఠంలో ఎం.పి.ఏ. కూచిపూడి నృత్యం, సర్టిఫికెట్, డిప్లొమా, సాత్వికాభినయం, యక్షగానం కోర్సుల్లో ప్రవేశాలు కల్పించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆయా కోర్సుల్లో ప్రవేశానికి ఆసక్తి ఉన్న అభ్యర్థులు అక్టోబరు 17, 2026లోగా సంబంధిత పీఠాధిపతి/ప్రిన్సిపాల్‌కు పూర్తి చేసిన దరఖాస్తులను అందజేయాలని రిజిస్ట్రార్ సూచించారు. రూ.300 ఆలస్య రుసుముతో అక్టోబరు 22లోగా కన్వీనర్, కేంద్ర ప్రవేశాల కమిటీ, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, బొమ్మూరు, రాజమహేంద్రవరం--533124 చిరునామాకు దరఖాస్తులు పంపవచ్చన్నారు. దరఖాస్తు ఫారాలను ఆన్‌లైన్‌లో కూడా పూర్తి చేయాలని, కోర్సు ఫీజులను ఆన్‌లైన్‌లో క్యూ.ఆర్. కోడ్ ద్వారా చెల్లించాలని తెలిపారు. పూర్తి వివరాలను విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌లో, ఇతర సమాచారం కోసం 9492692389, 80032947005 నంబర్లలో సంప్రదించవచ్చని పేర్కొన్నారు. ఆయా కోర్సులకు నిర్దేశించిన విద్యార్హతలు, పూర్వ కోర్సుల ఉత్తీర్ణత తదితర అర్హతలను అభ్యర్థులు కలిగి ఉండాలని తెలిపారు. కోర్సుల వ్యవధి, సీట్లు, ఫీజులు, ప్రవేశ అర్హతలు తదితర పూర్తి వివరాలను వెబ్‌సైట్‌లో పరిశీలించవచ్చని ఆయన సూచించారు.ఫోన్ నెంబర్ 0883 2947005 సంప్రదించ గలరుద

## పెన్షన్ల పంపిణీ కార్యక్రమం లో పాల్గొన్న ఎమ్మెల్యే బొలిశెట్టి

**తాడేపల్లిగూడెం. పెన్ పవర్.** తాడేపల్లిగూడెం పురపాలక సంఘం పరిధిలోని 7వ వార్డు షాదీఖానా వద్ద ఈరోజు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తాడేపల్లిగూడెం శాసనసభ్యులు శ్రీ బొలిశెట్టి శ్రీనివాస్ పాల్గొని లబ్ధిదారులకు పెన్షన్లను అందజేశారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ డి భవాని బాబు , రెవెన్యూ ఆఫీసర్ పి ప్రసాద్ రావు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ జి సీతారాం, సానిటేషన్ సూపర్వైజర్ సోమేశ్వరరావు, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ హరీష్ , మున్సిపల్ అధికారులు, వార్డు సచివాలయ సిబ్బంది, పెన్షన్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

## శశి ఇంజినీరింగ్ కళాశాలలో మెగా రక్తదాన శిబిరం 190 మంది విద్యార్థుల స్వచ్ఛంద రక్తదానం.






**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. అక్టోబర్ 01:**తాడేపల్లిగూడెంలోని శశి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ ఇంజనీరింగ్ లో భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ మై భారత్, పశ్చిమ గోదావరి ఆధ్వర్యంలో సేవా పక్వాడ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, వసుంధర బ్లడ్ సెంటర్ సంయుక్త సహకారంతో, లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్--ఏలూరు ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని 190 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు.

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కళాశాల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాల కృష్ణ మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమని, ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడటంలో రక్తదాతల పాత్ర ఎంతో గొప్పదని తెలిపారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో శశి విద్యాసంస్థలు ఎల్లప్పుడూ ముందుంటాయని పేర్కొంటూ రక్తదాతలను అభినందించారు.

కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మహమ్మద్ ఇస్మాయిల్ మాట్లాడుతూ విద్యార్థుల్లో విద్యతో పాటు సేవాభావం, సామాజిక బాధ్యత పెంపొందించడం ఎంతో అవసరమన్నారు.మై భారత్ కోఆర్డినేటర్ ప్రేమ్ సింగ్, రెడ్ క్రాస్ కోఆర్డినేటర్ సూర్య, లయన్స్ క్లబ్ ఏలూరు అధ్యక్షులు శ్రీ హరి, సభ్యులు శ్రీనివాస్ తదితరులు పాల్గొని రక్తదాతలను అభినందించారు.సేవా పక్వాడలో భాగంగా విద్యార్థులకు స్వచ్ఛతపై అవగాహన కల్పించి, అతిథులు, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులతో కలిసి స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ షేక్ సల్మాన్ భాష, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## డిబేట్లో రెండో స్థానం సాధించిన నందిని



**వై రామవరం, పెన్ పవర్, అక్టోబర్ 1 :** జిల్లాస్థాయి డిబేట్ పోటీలలో మండలంలో దాలిపాడు ఆశ్రమ బాలికోన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని కారం నందిని ద్వితీయ స్థానం సాధించిందని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగలక్ష్మి తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం సేవా సంకల్ప అభియాన్ లో భాగంగా సేవతో దేశ నిర్మాణం పై జిల్లా స్థాయి రంప చోడవరంలో జరిగిన డిబేట్ పోటీలలో తమ పాఠశాల విద్యార్థిని ద్వితీయ స్థానం సాధించిందని తెలిపారు. తమ పాఠశాల విద్యార్థిని జిల్లా స్థాయిలో డిబేట్లో ద్వితీయ స్థానం సాధించడం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

# మురళీకృష్ణంరాజు కుటుంబానికి పలువురు నాయకులు పరామర్శ





**కిర్లంపూడి,ప్రత్తిపాడు, పెన్ పవర్,అక్టోబర్,01:** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గం పరిశీలకులు, ప్రత్తిపాడు నియోజకవర్గ వైసిపి నాయకులు, ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీ కృష్ణంరాజు కుటుంబానికి గురువారం పలువురు నాయకులు పరామర్శించారు. కృష్ణంరాజు తండ్రి ముదునూరి రామరాజు ఇటీవల మృతి చెందారు. విషయము తెలుసుకున్న పలువురు వైసీపీ నాయకులు, టిడిపి నాయకులు మురళీ కృష్ణంరాజు, ఆయన సోదరుడు సీతారామరాజుతోపాటు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తమ తీవ్ర ప్రగాఢ సంతాపాన్ని తెలియజేయడమే కాకుండా, రామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కృష్ణంరాజు కుటుంబ సభ్యులను పరామర్శించిన వారిలో ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభరాజా, రాష్ట్ర ఖాదీ, చిన్న తరహా పరిశ్రమల శాఖ వైస్ చైర్మన్ కొమ్ముల కన్నబాబు, పలువురు టిడిపి నాయకులు,పెద్దాపురం నియోజకవర్గం వైసీపీ ఇన్చార్జ్ దవులూరి దొరబాబు,వైసిపి నాయకులు గౌతు స్వామి,కిర్లంపూడి మాజీ ఎంపీపీ తోట రవి, జగ్గంపేట నియోజకవర్గం అభివృద్ధి కమిటీ సభ్యులు భూపాలపట్నం ప్రసాద్,జగ్గంపేట మార్కెట్ కమిటీ డైరెక్టర్ బొదిరెడ్ల సుబ్బారావు,ప్రత్తిపాడు మాజీ ఎంపీపీ గోళ్ళ కాంతి సుధాకర్, సూర్య గ్లోబల్ హాస్పిటల్ కు చెందిన రాజా, సురేష్, పిఠాపురం కార్తికేయ హాస్పిటల్ కి చెందిన మొగిలి సాంబశివరావు, ఓరుగంటి గోపాలకృష్ణ, ది కిర్లంపూడి ప్రెస్ క్లబ్ గౌరవాధ్యక్షులు, పెంటకోట సాయి,ది కిర్లంపూడి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఉడతా అప్పారావు, కోలా తాతబాబు, బొల్లు నాగేశ్వరరావు, పశ్చిమగోదావరి జిల్లా వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులు ప్రసాదరాజు, ఆకివీడు మండల అధ్యక్షులు నంద్యాల సీతారామయ్య ఏలేశ్వరం నగర పంచాయతీ మాజీ చైర్మన్ అలమండ చలమయ్య తోపాటు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా, పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన పలువురు వైసీపీ నాయకులు, కూటమి నాయకులు, మురళీ కృష్ణంరాజు అభిమానులు భారీగా తరలివచ్చి మురళీకృష్ణంరాజు కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## తాడేపల్లిగూడెంలో బియస్ యన్ యల్ ఉద్యోగుల ద్విచక్రవాహన ర్యాలీ.







**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. అక్టోబర్ 01** బియస్ యన్ యల్ 26వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఆ సంస్థ ఉద్యోగులు తాడేపల్లిగూడెం పట్టణంలో ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. వినియోగదారులకు బియస్ యన్ యల్ అందించే వివిధ ఆధునిక సేవల వివరాలను తెలిపే ప్లకార్డులను ఈసందర్భంగా ప్రదర్శించారు. ఈకార్యక్రమంలో డివిజనల్ ఇంజనీర్ కెవిఏపి సుబ్బారావు, సబ్ డివిజనల్ ఇంజనీర్లు, ప్రసాద్, ప్రతాప్ కుమార్, జెటిఓలు మధుబాబు, సూర్రెడ్డి, పట్నాయక్, శంకర్ నాయక్,సుజాత, ఇతర ఉద్యోగులు మరియు టిప్ భాగస్వాములు పాల్గొన్నారు.

## వేణుగోపాల స్వామి ఆలయం కళ్యాణ మండపం ఘనంగా ప్రారంభోత్సవం.



**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. అక్టోబర్ 01:**కె. పెంటపాడు గ్రామంలోని బైరాగి మఠం వద్ద శ్రీ వేణుగోపాల స్వామి ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన కళ్యాణ మండపం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే ఌ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ హాజరయ్యారు.



ఈ సందర్భంగా ముందుగా శ్రీ వేణుగోపాల స్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొని, స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం కళ్యాణ మండపం వద్ద రిబ్బన్ కట్ చేసి ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు.గ్రామ ప్రజలకు, భక్తులకు మరియు శుభకార్యాల నిర్వహణకు ఉపయోగకరంగా ఉండేలా కళ్యాణ మండపం అందుబాటులోకి రావడం పట్ల ఎమ్మెల్యే సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు, స్థానిక నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు మరియు గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

## అక్టోబర్ 2న మద్యం మరియు మాంసం దుకాణాలు మూసివేత



**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. అక్టోబర్ 01:**గాంధీ జయంతి సందర్భంగా రేపు 02-10-2026 శుక్రవారం తాడేపల్లిగూడెం పురపాలక సంఘం పరిధిలోని మద్యం దుకాణాలు, బార్లు, మాంసం మరియు చేపల దుకాణాలు పూర్తిగా మూసివేయాలని, రెస్టారెంట్, హోటళ్ల లో కూడా మాంసం విక్రయించకూడదని కమిషనర్ యేసుబాబు ఆదేశించారు.గాంధీ జయంతిని పురస్కరించుకుని ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఈ నిషేధం అమలు చేయబడుతుంది. నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోబడతాయి.ప్రజలు మరియు వ్యాపారులు సహకరించాలని కోరడమైనది.

## ఆర్డీవో కె. స్వాతికి ఘన వీడ్కోలు



**ఐదు నెలల సేవలు ప్రశంసనీయం.. ప్రజలకు అంకితభావంతో సేవలందించారు**

**నూతన సబ్ కలెక్టర్ పృథ్వీరాజ్‌కు అధికారుల స్వాగతం**

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, అక్టోబర్ 1:**బదిలీపై వెళ్తున్న రంపచోడవరం రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో) కె. స్వాతికి అధికారులు, సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. గురువారం సాయంత్రం రంపచోడవరం ఐటీడీఏ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ ఆధ్వర్యంలో సత్కార కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ మాట్లాడుతూ కొత్త జిల్లా ఏర్పాటైన నేపథ్యంలో రంపచోడవరం డివిజన్‌కు ఆర్డీవో సేవలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో బదిలీలు సర్వసాధారణమని, ఇటీవల ఆర్డీవోగా పనిచేసిన కె. స్వాతి ప్రత్యేకత కలిగిన అధికారిగా సేవలందించారని కొనియాడారు. విధుల్లో ఎదురయ్యే సమస్యలను చూసి నిరుత్సాహపడకుండా ధైర్యంగా, సమర్థవంతంగా ఎదుర్కోవడం ముఖ్యమన్నారు.

వివిధ అధికారిక పర్యటనలు, కార్యక్రమాల్లో ఆమె అంకితభావంతో పనిచేశారని తెలిపారు. 24 గంటలూ అందుబాటులో ఉండే విధుల్లో భాగంగా తన పరిధిలోని ప్రజలకు సేవలందిస్తూ అన్ని బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారని ప్రశంసించారు. విధుల పట్ల ఆమె చూపిన అంకితభావం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

### ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

నూతన రంపచోడవరం సబ్ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని ప్రజలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు సకాలంలో అందేలా అందరూ సమన్వయంతో పనిచేయాలని అన్నారు. జిల్లా కలెక్టర్ సూచనలు, సలహాలను పాటిస్తూ ప్రజల సమస్యలను ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. బదిలీపై వెళ్తున్న ఆర్డీవో కె. స్వాతి సేవా స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తామని పేర్కొన్నారు.

### సహకారం మరువలేను

బదిలీపై వెళ్తున్న ఆర్డీవో కె. స్వాతి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ సహాయ సహకారాలతో రంపచోడవరం ప్రాంత ప్రజలకు సేవ చేయడం తనకు ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. ఐదు నెలల పాటు ఆర్డీవోగా విధులు నిర్వహించిన సమయంలో తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది అందించిన సహకారం మరువలేనిదని తెలిపారు. తనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

అనంతరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్, నూతన సబ్ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్‌లు ఆర్డీవో కె. స్వాతిని గజమాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. వివిధ శాఖల అధికారులు, రెవెన్యూ అసోసియేషన్ ప్రతినిధులు, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, సబ్ కలెక్టర్ కార్యాలయ అధికారులు, సిబ్బంది శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. అదే సందర్భంగా నూతన సబ్ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్‌కు అధికారులు స్వాగతం పలికారు.కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి జి. భాస్కర్, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ దాసరి రత్నాకరరావు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి దేవదానం, ఐసీడీఎస్ పీడీ కె. ఉమా, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మండయ్య, సీపీఓ వెంకట్రావు, ఏపీవో జనరల్ డీఎన్‌వీ రమణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఐ. శ్రీనివాసరావు, రవికుమార్, పలువురు తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఐటీడీఏ అధికారులు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com